



పశువులకు పచ్చికబైళ్లగా మారిన ఆయకట్టు

సొసైటీని అభివృద్ధిపథంలో నడిపించాలి

● మినిస్ట్రీ ఆఫ్ కోఆపరేటివ్ అధికారి సిద్ధార్థజైన్



కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సిద్ధార్థజైన్


ఒంటిమిట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రజలు అన్నిరకాల వ్యాపారాలు చేసి అభివృద్ధి చెందాలని మినిస్ట్రీ ఆఫ్ కోఆపరేటివ్ అధికారి సిద్ధార్థజైన్ పేర్కొన్నారు. బుధవారం ఒంటిమిట్టలోని చెర్లోపల్లె పీఏసీ బ్యాంకును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు అందించడంతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీవో వెంకట సుబ్బయ్య, డీఆర్ఎం గోపిక్రిష్ణ, డీసీసీబీ సీఈవో రాజామణి, నాబార్డు డీడీఎం విజయవిహారి, ఎస్‌డీఎల్‌సీవో శ్రీధర్, ఇన్‌స్పెక్టర్ అమీర్‌సాహెబ్, సొసైటీ ఛైర్‌పర్సన్ జయక్రిష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. ఇన్ని సెలవులా...!

● నవంబరులో ఏకంగా 12 రోజులు

పీలేరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు, రెండు కాదు.. నవంబరు నెలలో బ్యాంకులకు 12 రోజులు సెలవులు రానున్నాయి. ఈ మేరకు బ్యాంకుల సెలవుల జాబితాను ఆర్బీఐ బుధవారం విడుదల చేసింది. వీటిలో రెండు ఆదివారాలు, నాలుగు శనివారాలతో పాటు వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పండుగల కారణంగా లభించే సెలువులు ఉన్నాయి. నవంబరు 1, 2, 5, 7, 8, 9, 11, 16, 22, 23, 25, 30వ తేదీల్లో బ్యాంకుల సెలవు కారణంగా ఖాతాదారులు తమ కార్యకలాపాలు ప్లాన్ చేసుకోవాలని ఆర్బీఐ కోరింది.

రాష్ట్రోత్సవంగా సీపీ బ్రౌన్ జయంతి



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సాహిత్య పునరుజ్జీవనానికి విశేష కృషి చేసిన బ్రిటీష్ పండితుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సీపీ బ్రౌన్) జయంతిని రాష్ట్రోత్సవంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. 1798 నవంబర్ 10న కోల్‌కతాలో జన్మించిన సీపీ బ్రౌన్ అప్పట్లో కడపలో పనిచేశారు. ఇక్కడ పనిచేస్తున్న సమయంలోనే తెలుగు భాష పునరుజ్జీవనానికి తన జీవితాన్ని అంకితం చేశారు. తన సంపాదన అంతా తెలుగు భాషాభివృద్ధికి ఖర్చు చేశారు. 1855లో ప్రభుత్వసేవల నుంచి వైదొలిగిన ఆయన, లండన్ విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేసి 1884 డిసెంబరు 12న కన్నుమూశారు. ప్రతి సంవత్సరం నవంబరు 10న సీపీ బ్రౌన్ జయంతిని రాష్ట్రోత్సవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వుల్లో తెలిపారు.

'అన్నమయ్య' ప్రశ్నార్థకం!



అన్నమయ్య ప్రాజెక్టు ఆనవాళ్లు



అలంకారప్రాయంగా అన్నమయ్య ప్రాజెక్టు ప్రధాన కాలువ

● ప్రాజెక్టు తెగిపోయి ఐదేళ్లు
● బీడుగా మారిన ఆయకట్టు..!
● ముంచుకొస్తున్న దుర్భిక్షం
● ఆయకట్టు రైతుల్లో అయోమయం

అన్నమయ్య ప్రాజెక్టు తెగి నవంబరు 19 నాటికి ఐదేళ్లు పూర్తవుతుంది. ఇప్పటిదాకా ప్రాజెక్టు పునరుద్ధరణపై అతీగతీ లేకపోవడంతో ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీంతో ఆయకట్టు భూములన్నీ బీళ్లుగా మారాయి. స్పిల్‌వే గేట్లు తప్ప ప్రాజెక్టు ఆనవాళ్లు కూడా లేకపోవడంతో ప్రధానకాలువ ముళ్లపొదలు పెరిగి మూసుకుపోయే పరిస్థితి ఏర్పడింది. గత పాలనలో రూ.800 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం చేస్తున్నామంటూ హడావిడి చేసినా.. అది మరుగున పడింది. కూటమి ప్రభుత్వంలోనైనా ప్రాజెక్టు పునఃనిర్మాణంపై దృష్టి సారించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

రాజంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజంపేట, పుల్లంపేట మండలాల్లో తరతరాలుగా కొనసాగుతున్న దుర్భిక్షం. తాగడానికి కూడా నీరు లేని పరిస్థితులు. వీటి నుంచి ప్రజలను బయటపడేసేందుకు ఖరీఫ్, రబీ సీజన్లు కలిపి 22,500 ఎకరాల ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో 20 ఏళ్ల క్రితం 2.23 టీఎంసీల సామర్థ్యంతో సుమారు రూ.60 కోట్లు ఖర్చు చేసి అన్నమయ్య ప్రాజెక్టు నిర్మించారు. అప్పట్లో రాజంపేట, పుల్లంపేట మండలాల్లోని ఆకేపాడు, బ్రాహ్మణపల్లె, వరదయ్యగారి పల్లె, మేకావారిపల్లె, మిట్టమీద పల్లె, బావికాడపల్లె, వత్తలూరు తదితర సుమారు 50 గ్రామాల్లో సాగు, తాగునీటి లభ్యత అతి తక్కువగా ఉండేది. ప్రాజెక్టు కట్టిన తర్వాత ఈ ప్రాంతాల్లో భూగర్భజలం పెరిగింది. మన్నూరు, చెర్లోపల్లె, వత్తలూరు, క్రిష్ణంపల్లె, బావికాడపల్లె ప్రాంతాల్లోని ఏడు చెరువులకు నీరందింది. భూగర్భజలాలు పెరగడంతో రైతులు బోరు బావులు వేసుకుని అరటి, బొప్పాయి, నిమ్మ, పసుపు, వరి, వేరుశనగ తదితర పంటలు పండించుకునేవారు. ఎప్పుడైతే ప్రాజెక్టు తెగిపోయిందో భూగర్భజల మట్టం ఒక్కసారిగా పడిపోయింది. ప్రస్తుతం 20 ఏళ్ల కిందటి దుర్భిక్ష పరిస్థితులు మళ్లీ వచ్చేశాయి. దీంతో అయిదేళ్లుగా వర్షపునీటి ఆధారంగా స్వల్పకాలిక పంటలు సాగు చేసుకుంటున్నారు. నిమ్మ, మామిడి తోటలు ఎండిపోవడంతో వాటిని నరికివేశారు. ప్రస్తుతం చెయ్యేరులో భారీగా నీరు ప్రవహిస్తున్నా అది సోమశిలలో కలిసిపోతుందే తప్ప చుక్కనీరు నిల్వ చేసుకునే పరిస్థితి లేకుండా పోయింది.




బీళ్లుగా మారిన ఆయకట్టు భూములు

గత పాలకుల తప్పిదం..

ప్రాజెక్టు పునర్నిర్మాణంపై గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. సరి కదా.. ఈ ప్రాజెక్టును పునర్నిర్మాణానికి రూ.800 కోట్లు కేటాయించామని, అందులో రూ.700 కోట్ల విలువైన పనులకు టెండర్లు వేస్తున్నట్లు ప్రకటనలు చేసి తద్వారా కాంట్రాక్టర్ల నుంచి సొమ్ము చేసుకునేందుకు యత్నించారు. ప్రభుత్వం మారడంతో ఆ టెండర్లు రద్దయ్యాయి. కూటమి ప్రభుత్వం కూడా ప్రాజెక్టు పునర్నిర్మాణంపై స్పష్టత ఇవ్వకపోవడంతో అన్నమయ్య ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రాజెక్టు పునర్నిర్మాణం కనుచూపు మేరలో లేనందున భూములను వర్షాధారంగా సాగు చేసుకోవాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడింది.

అరకొరగా నిండిన మన్నూరు చెరువు



లిఫ్టు ఇరిగేషన్ ద్వారా నీరందించాలి



ప్రాజెక్టు తెగిపోయిన ప్రాంతంలో ఏటికి అడ్డంగా 10 అడుగుల ఎత్తున గోడలు నిర్మించి నీటిని నిల్వ చేయవచ్చు. ఈ నీటిని లిఫ్టు ఇరిగేషన్ ద్వారా కాలువకు అందిస్తే ఆయకట్టు సాగుకు నోచుకుంటుంది. నదిలో నీటి నిల్వ కారణంగా భూగర్భజలాలు పెరుగుతాయి. ప్రస్తుతం ఇదే పద్ధతిలో రాజంపేట పట్టణ ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. అదే పద్ధతిలో సాగునీటిని కూడా అందించవచ్చు.

- తోట రామయ్య, రాజంపేట.

ప్రాజెక్టు పునర్నిర్మాణంపై స్పష్టత ఇవ్వాలి



ప్రాజెక్టు తెగిపోయి అయిదేళ్లు అవుతున్నా.. పునర్నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం దుర్మార్గం. గత ప్రభుత్వంలో పునర్నిర్మాణం పేరిట కోట్లకు టెండర్లు వేసి కాంట్రాక్టరు ద్వారా తిరిగి అవినీతి సొమ్మును దోచుకోవాలని చూశారే తప్ప ప్రాజెక్టు కట్టాలన్న ఆలోచన లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతున్నా స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఆయకట్టు రైతుల్లో తీవ్ర నిరాశ ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలి.

-టి.లక్ష్మీనారాయణ, టీడీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు

యువతిని మోసం చేసిన కేసులో...

వ్యక్తికి జీవిత ఖైదు

● రూ.1.6 లక్షల జరిమానా
● ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



జీవిత ఖైదు పడ్డ నిందితుడితో పోలీసులు

రాయచోటిటౌన్/రైల్వేకోడూరు అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఓ యువతిని వివాహం చేసుకుంటా నని నమ్మించి మోసం చేసిన కేసులో కడపలోని 7వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఓ వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించినట్లు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాల్లోకెళ్తే.. జిల్లా పరిధిలోని రైల్వేకో డూరు మండలం రెడ్డివారిపల్లెకు చెందిన 50 ఏళ్ల గొంతు సుబ్రమణ్యం 20 ఏళ్ల యువతిని పెళ్లి పేరుతో మోసం చేసినట్లు రుజువైందన్నారు. 2022 సంవత్సరం మార్చి నెల 22న రైల్వేకోడూరు పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదు చేయగా అప్పటి రైల్వేకోడూరు సీఐ విశ్వనాధరెడ్డి, ఎస్ఐ ఈవీఎల్ నరసింహంలు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్ హెగ్డే పర్యవేక్షణలో రైల్వేకోడూరు ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, సీఐ హేమసుందర్ రావులు, జిల్లా కోర్టు మానిటరింగ్ సెల్ సీఐ ఆదినారాయణరెడ్డి, ఏఎస్ఐ శేఖర్‌రావు, కోర్టు కానిస్టేబుల్ విశ్వనాథ్, కోర్టు సిబ్బంది కేసు దర్యాప్తును పూర్తి చేసి కడప కోర్టులో చార్జిషీటును ఫైల్ చేయగా కేసును విచారించిన కడప ఏడవ అడిషనల్ జిల్లా న్యాయమూర్తి జీఎస్ రమేశ్‌కుమార్ నిందితుడు సుబ్రమణ్యంకు జీవిత ఖైదుతో పాటు రూ.1.60 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారికి కఠిన శిక్షణ పడేలా గుడ్‌ట్రయల్ మానిటరింగ్ కొనసాగు తుందని ఎస్పీ తెలిపారు. కాగా న్యాయం అందించడంలో కృషి చేసిన అధికారుల బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండండి

● ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



రాయచోటిటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ప్రజలకు సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిధిలో సైబర్ నేరాల ఉచ్చులో అమాయక ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, రైతులు చిక్కుకోవద్దని ప్రజలను అప్రమత్తం చేశారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడుతున్న విషయం పోలీసుల దృష్టికి వచ్చిందని, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ మోసపోవద్దని ఆయన గట్టిగా హెచ్చరించారు. ప్రధానంగా స్కాలర్‌షిప్ మంజూరైందంటూ సైబర్ నేరగాళ్లు విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కాల్స్ చేయడం, మెజేస్‌లు పంపడం చేస్తున్నారన్నారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్) చెప్పమని అడిగి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అలాగే ఇటీవల తుఫాను, ఇతర ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇస్తామంటూ రైతుల మొబైల్ ఫోన్‌లకు ఫ్రాడ్ కాల్స్ చేస్తున్నారన్నారు. పరిహారం పేరుతో మోసగాళ్లు సున్నితమైన సమాచారాన్ని సేకరించి డబ్బు కాజేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా మీ పాస్‌బుక్‌లలో, బ్యాంక్ ఖాతా వివరాల్లో, ఆన్‌లైన్‌లో పొరపాట్లు ఉన్నాయని, వాటిని సరిదిద్దాలంటూ సైబర్ నేరగాళ్లు రైతులను టార్గెట్ చేస్తున్నారని తెలియజేశారు. అంతేగాక సైబర్ నేరగాళ్లు తప్పులను సరిదిద్దే నెపంతో తెలియని లింక్‌లను క్లిక్ చేయమని, ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్) బ్యాంకు వివరాలను చెప్పమని అడుగుతున్నారన్నారు. ఇలాంటి వారిని ఎట్టి పరిస్థితిలోనూ రైతులు గానీ, విద్యార్థులు గానీ వెల్లడించకూడదన్నారు. తెలియని నెంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు, మెసేజ్‌లకు స్పందించవచవద్దని ఎస్పీ కోరారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లయితే తక్షణమే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్ చేయడంతో పాటు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

పంటనష్టం వివరాలను తెలియజేయండి

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ



రెడ్డివారిపల్లెలో వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి శివనారాయణ

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాను వల్ల దెబ్బతిన్న పంటనష్టం వివరాలను వెంటనే నమోదు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లె మండలంలోని రెడ్డివారిపల్లెలో వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల వచ్చిన తుఫాన్ ప్రభావం నేపథ్యంలో పంట నష్టంపై సమగ్రంగా పరిశీలించి వాటి వివరాలు రైతు పేరుతో సహా సేకరించాలన్నారు. అలాగే వర్షం వల్ల వరిపంట మునిగిపోతే నీరును తొలగించి వర్షం పూర్తిగా తగ్గిన తర్వాత పంట కోత ప్రారంభించాలన్నారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలన్నారు. రబీ సీజన్‌కు రైతులు సాగుకు సన్నద్ధం కావాలని, ఈ రబీలో వర్షాలు బాగా కురిశాయని, ప్రతి రైతు పంట సాగు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏడీఏ జయరాణి, వ్యవసాయ అధికారి రాజాకుమారి, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకుల అరెస్ట్
6
చిట్‌ఫండ్ సభ్యులపై యాజమాన్యం దాడి

రూ.7.5 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి




రింగురోడ్డు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏ ప్రమాదాలు చోటుచేసుకోకుండా పట్టణ పరిధిలోని మదనపల్లి రోడ్డులో సుమారు రూ.7.5 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పట్టణంలోని జాతీయ రహదారి, రింగు రోడ్డు అభివృద్ధి పనులను అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాయచోటి- కడప రోడ్డు నుంచి వేంపల్లి రోడ్డు, గాలివీడు రోడ్డు, మదనపల్లి రోడ్డు, పీలేరు రోడ్డు వరకు రింగు రోడ్డును డబుల్ లైన్ రోడ్డుగా కొత్తగా నిర్మాణం చేపడుతున్నామని, పనులు వచ్చే ఆరు నెలల్లో పూర్తవుతాయన్నారు. ఎవ్వరికీ ఏ విధమైన ఆటంకాలు లేకుండా 120 అడుగుల రోడ్డును మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందులోనే ఫ్లైఓవర్ పనులకు సంబంధించి రోడ్డుకు ఇరువైపులా ప్రయాణించే వాళ్లకు, చుట్టుపక్కల నివాసం ఉన్నవారికి రాబోయే కాలంలో ఏ విధమైన సమస్యలు లేకుండా డ్రైనేజీ ఏర్పాటుతో పాటు సర్వీస్ రోడ్ల నిర్మాణం కూడా చేపడతామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అధికారులు, ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి, సురేశ్‌రెడ్డి, కొండారెడ్డి, జంగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమ్మె తాత్కాలిక వాయిదా

● ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోకన్వీనర్ శ్రీనివాసులు

రాయచోటిటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా మున్సిపల్ కార్మికుల సమ్మెను వాయిదా వేసినట్లు ఆ వర్కర్స్ యూనియన్ జిల్లా కోకన్వీనర్ నేలపాటి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మున్సిపల్ కార్మికుల సమస్యలపై నవంబరు 3 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టనున్నట్లు సమ్మె నోటీసును ఇచ్చామన్నారు. సమ్మె సన్నాహకంలో భాగంగా అక్టోబరు 13 నుంచి దశల వారి ఆందోళనల కార్యక్రమాల వివరాలను అందించామన్నారు. అందులో భాగంగానే అక్టోబరు 27న మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయాల ముట్టడి, అక్టోబరు 29, 30వ తేదీల్లో వడ్డేశ్వరంలో గల సీడీఎంఏ కార్యాలయం ఎదుట దీక్షలను చేపట్టనున్నట్లు తెలియజేశామన్నారు. అయితే ఒకవైపు రాష్ట్ర సీడీఎంఏ కార్యాలయం తరలింపుతో పాటు మరో వైపు ఈ నెల 27, 28, 29వ తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం మొంథా తుఫాను సెలవులు ప్రకటించడం తదితర ఇబ్బందుల దృష్ట్యా పారిశుధ్య సేవలు అనివార్యం కావడంతో అక్టోబరు 29, 30వ తేదీల్లో జరపాల్సిన దీక్షలను ప్రస్తుతానికి తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని, తిరిగి ఎప్పుడు చేసేది త్వరలో తెలియజేస్తామన్నారు.


నామాల గుట్టపై కట్టిన ఇళ్లు

పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం.. ఊర్లకు ఊర్లు కట్టిస్తాం.. అంటూ గత ప్రభుత్వం తమను నట్టేట ముంచిందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటిన్నర సెంటు స్థలంలో, వారిచ్చిన మొత్తంతో పాటు అప్పు చేసి మరీ నిర్మించిన ఇళ్లు పూర్తి కాకపోవడంతో నష్టపోయామని అంటున్నారు. జగనన్న కాలనీల పేరుతో ఏర్పాటు చేసిన లేఅవుట్లు జనావాసాలకు దూరంగా అనువుగాని చోట గుట్టలు కొండల్లో ఉండడంతో అవి నివాసయోగ్యంగా లేవని నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

అనువుగాని చోట..

- అధిక శాతం అసంపూర్తి భవనాలే..
- అప్పుల పాలైన లబ్ధిదారులు
- పేదలను ముంచిన జగనన్న ప్రభుత్వం

జగనన్న లేఅవుట్‌లు!

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో సంబేపల్లె మండలంలో 17 లేఅవుట్లు వేసి, ఒక్కొక్కరికి 1.5 సెంట్లు చొప్పున పట్టాలిచ్చి 1,484 గృహాలు మంజూరు చేశారు. కాలనీలో గృహాలన్నీ ఒకే కొలతల్లో ఆదర్శంగా ఉండాలి. అయితే కొన్ని చోట్ల పలుకుబడి ఉన్న వాళ్లు ఒక్కొక్కరు రెండు, మూడు ప్లాట్లు ఆక్రమించుకొని పెద్ద పెద్ద గృహాలు కట్టడం ఈ వ్యవహారంలో అక్రమాలు చోటు చేసుకున్నాయడానికి నిదర్శనం. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం. జగనన్న లేఅవుట్లకు కేటాయించిన స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్ పేరుతో పలువురు నాయకులు తొలి దశలోనే సొమ్ము చేసుకున్నారు. ఇసుక, సిమెంటు, కడ్డీలు గృహ అవసరాలకు ఉపయోగపడే సామగ్రి ధరలు అధికంగా ఉండడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోక అప్పులు చేసి కొంత మంది గృహాలు కట్టారు. కొంత మంది పునాది దశలోనే వదిలేశారు. మరికొంత మంది గోడలు పూర్తి చేసి, మరికొంత మంది మౌల్డింగ్ వేసి వదిలేశారు.

మన ఇళ్లు, మన గౌరవం..

గత వైసీపీ ప్రభుత్వంలో గృహాలు మంజూరైనా ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేక వివిధ దశల్లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో 'మన ఇళ్లు మన గౌరవం' పేరుతో లబ్ధిదారులకు రుణాలను అందించేలా డ్వాక్రా తరఫున ప్రోత్సాహం అందించింది. అయితే ఇప్పటికీ. 40 శాతం నిర్మాణాలు పూర్తి కాగా, . ఇంకా 60 శాతం వివిధ దశల్లో ఉన్నాయి. సంబేపల్లె మండలంలోని మోటకట్ల పంచాయతీలోని వడ్లపల్లి మార్గంలో 183 గృహాలకు లేఅవుట్‌లు వేసి, 120 మందికి గృహాల మంజూరు పత్రాలను అందించారు. అయితే, ఈ కాలనీలో పలువురు అనర్హులు పునాదులు వేసి వదిలేశారు. గృహాల పేరుతో వ్యాపారం చేసేందుకు కొంత మంది ఈ మార్గాన్ని ఎంచుకోవడంతో ఇప్పటికీ ఇక్కడ పునాదులే కనిపిస్తున్నాయి. సంబేపల్లె పంచాయతీ నామాల గుట్టపైన 40 గృహాలు మంజూరు చేసినా, ఆ ఇళ్లు ఇక్కడ నివాస యోగ్యంగా లేవు. దుద్యాల, దేవపట్ల, నారాయణరెడ్డిపల్లె, ఇలా చాలా గ్రామ పంచాయతీల్లో ఇదే పరిస్థితి.


బండపై పునాది కోసం రాళ్లు తోలి వదిలేసిన దృశ్యం


గోడల స్థాయిలోనే నిలిచిపోయిన పనులు

భవనాలకు ఆర్థిక భరోసా



పూర్తికాని ఇండ్ల కోసం కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసాను కల్పించింది. బీసీ, ఎస్సీ, మైనా రీ లబ్ధిదారులకు 50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు 75 వేల రూపాయలు చొప్పున సాయం అందించింది. మన ఇళ్లు, మన గౌరవం పేరుతో డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నా ఆర్థికంగా ఇబ్బందుల కారణంగా లబ్ధిదారులు ముందుకు రావడం లేదు.

- కూనాసి సుబ్బరాజుయాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్

చెరువులకు జలకళ

మదనపల్లె టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ మదనపల్లె డివిజన్‌లో 357 చెరువులు నిండాయని ఈఈ సురేష్‌బాబు ప్రకటించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లోని 16 మండలాల్లో 1,959 చెరువులు ఉన్నాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దేరు, బాహుదా ప్రాజెక్టులు నిండి మొరవలు పోతున్నాయని, 357 చిన్న, పెద్ద చెరువులు నిండిపోయాయన్నారు. వీటితో పాటు 362 చెరువులు 75 శాతం నీటితో నిండాయని, 434 చెరువులు 50శాతం నిండాయన్నారు. 302 చెరువులు పాతిక శాతం మాత్రమే నిండాయన్నారు. పెద్దేరు, బాహుదా ప్రాజెక్టు వద్ద తమశాఖ అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, నిండిన చెరువుల కట్టల పరిస్థితిని రోజూ జలవనరులశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. ఎక్కడైనా చెరువు కట్టలు ప్రమాదకర స్థితిలో సమాచారం ఇవ్వాలని ఈఈ కోరారు.

డ్రోన్ల సాయంతో మందులు పిచికారీ చేయాలి

- కృషి విజ్ఞాన్ కేంద్రం సమన్వయకర్త అంకయ్య కుమార్

ఒంటిమిట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : భూమిలో తేమ ఎక్కువగా ఉన్నందున డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేసి పంటను పాడుకోవాలని, కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్ సూచించారు. బుధవారం మండలంలోని నర్సన్నగారిపల్లె, గంగపేరూరు గ్రామాల్లో సాగుచేసిన వరిపైరును పరిశీలించారు. వర్షం కారణంగా వరికంకుల నుంచి గింజలు మొలకెత్తాయన్నారు. పడిపోయిన కంకుల్లోని గింజలు కూడా మొలకెత్తాయన్నారు. దీని నివారణకు ఒక లీటరు నీటికి 50 గ్రాముల చొప్పున ఉప్పును కలిపి పిచికారీ చేయాలన్నారు. నల్లగింజ, పొట్ట కుళ్లు, మానిపండు తెగుళ్లు, దోమ పోటు నివారణకు మందులు వాడాలన్నారు. పసుపులో దుంపకుళ్లు, ఆకుమచ్చ ఇనుప దాతువు లోప నివారణకు మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, మాధురి, యాస్మిన్, కృష్ణప్రియ, మండల వ్యవసాయాధికారి మంజుల రాణి, రైతులు పాల్గొన్నారు.


వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పదో తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఆఫీసర్ కొండూరు శ్రీనివాసరాజు పరిశీలించారు. విద్యా కమిషనర్ విజయరామరాజు ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2026 మార్చిలో జరగబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలకు అన్నమయ్య జిల్లా లో 121 సెంటర్లు ఏర్పాటు చేశామని, అందులో కొన్ని సెంటర్లలో విద్యార్థులకు వసతులు, డెస్కులు, విద్యుత్, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై ఆరా తీస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, సూపరింటెంట్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


మోడల్ స్కూల్‌లో డెస్కులను పరిశీలిస్తున్న కొండూరు శ్రీనివాసకుమార్‌రాజు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నాగిరెడ్డిపల్లె విద్యార్థి

నందలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కోమటిగుంట అశోక్ ఇటీవల జరిగిన అండర్-14 బాలుర వాలీబాల్ పోటీల్లో విజయం సాధించి రాష్ట్ర సాయికి ఎంపికయ్యాడు. బుధవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరి తదితరు లు అశోక్‌ను అభినందిస్తూ జ్ఞాపిక, పుస్తకం బహూకరించారు. రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచి పాఠశాలకు గుర్తింపును తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యా యుడు రాజేంద్ర పాల్గొన్నారు.


అశోక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లకు శిక్షణ

బి.కొత్తకోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌లో బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాజమండ్రి ప్రాంతానికి చెందిన 20 మంది ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, 40 మంది బీట్ ఆఫీసర్లు శిక్షణ తరగతులలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలపై వారికి అవగాహన కల్పించారు. స్థానిక సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ హార్సిలీహిల్స్ చరిత్రను వారికి వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న శివకుమార్

'పారిశుధ్య సమస్యలు రాకుండా చూడాలి'

వాల్మీకిపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని డీఎల్‌పీఓ నాగరాజు సూచించారు. బుధవారం ఆయన స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బంది విధుల వివరాలను ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ తుపాను వర్షం కారణంగా పట్టణంలో సమస్య లను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, తాగునీటి ఇబ్బందులను కూడా గుర్తిస్తూ ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. పంచాయతీ పరిధిలో వందశాతం బకాయిల వసూళ్లు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా చేసేలా వేగవంతం చేయాలన్నారు. అనంతరం స్థానికంగా పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓ రవీంద్రనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.


వాల్మీకిపురంలో పంచాయతీ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

టీడీపీ ఎన్ఆర్ఐ ఆస్ట్రేలియా కోఆర్డినేటర్‌గా విలియంబాబు



మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా టీడీపీ ఎన్ఆర్ఐ ఐటీ కోఆర్డినేటర్‌గా మదనపల్లెకు చెందిన బోనాసి విలియం బాబు ఎన్నికయ్యారు. మంగళవారం ఆస్ట్రేలియా దేశంలోని మెల్‌బోర్న్‌లో నిర్వహించిన ఎన్ఆర్ఐ టీడీపీ నూతన కమిటీ ఎన్నికలో అధ్యక్షురాలిగా పాలడుగు వినీల ఎన్నికవగా, విలియంబాబు ఐటీ, మీడియా కోఆర్డినేటర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మదనపల్లెలో టీడీపీ క్రిస్టియన్ మైనార్టీ టీడీపీ నేత బోనాసి జాన్‌బాబు మాట్లాడుతూ తమ కుమారుడు టీడీపీ ప్రతినిధిగా ఆస్ట్రేలియాలో తెలుగు వారికి సేవలందించేందుకు ఎన్నికవడం ఆనందంగా ఉందన్నారు. ఆస్ట్రేలియాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహంతో విలియం బాబు మరిన్ని కార్యక్రమాలు చేసేందుకు ముందుకు వెళుతున్నారన్నారు. విలియంబాబుకు మదనపల్లె క్రిస్టియన్ నేతలు అభినందనలు తెలిపారు.

కడప-బెంగుళూరు రైల్వే లైన్‌పై నిర్లక్ష్యం ఎందుకు?

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప-బెంగుళూరు బ్రాడ్ గేజ్ రైల్వే నిర్మాణంపై నిర్లక్ష్యం ఎందుకని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులపై అధికారులతో జరిగిన సమీక్షలో కడప-బెంగుళూరు రైల్వే నిర్మాణంపై చర్చించక పోవడం శోచనీయమని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3038 కోట్ల అంచనాతో 25 కిలోమీటర్ల పొడవున రైల్వేలైన్ వేసేలా కేంద్రం 50శాతం, రాష్ట్రం 50శాతం భరించేలా పనులు ప్రారంభమయ్యాయన్నారు. కడప నుంచి పెండ్లిమర్రి వరకు 22 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని, రూ.350కోట్లు ఖర్చు చేయగా, రూ.133కోట్లు రాష్ట్రం భరించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా రైల్వేలైన్‌పై దృష్టిసారించి నిధులు కేటాయించాలని సూచించారు.

మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి

రామాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కింద పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాచపల్లి పంచాయతీ ఎగువ ఉప్పరపల్లికి చెందిన టేకూరి వెంకట నారాయణ(67) మదన పల్లిలో మగ్గం నేస్తుంటాడు.ఈ నెల 25వ తేదీన స్వగ్రామంలోని ఇంటికి వచ్చాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో మండల కేంద్రం సమీపంలో కిందపడడంతో తలకు, కాళ్లకు గాయాలై అక్కడే పడిపోయాడు. బుధవారం ఉదయం అతనిని గమనించిన స్థానికులు అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. రామాపురం పోలీసులు మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వెంకటనారాయణ మృతదేహం

క్రెడిట్ కార్డు అప్‌గ్రేడ్ పేరుతో మోసం

పీలేరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు లిమిట్ పెంపు పేరుతో సైబర్ నేరగాళ్లు ఆ కార్డులోని రూ.1.61 లక్షలు కాజేసిన సంఘటన బుధవారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు పట్టణం నాగిరెడ్డి కాలనీకి చెందిన సాయి సత్యం వీఎస్ఎన్ సాయి సార్‌గా స్థానికంగా చిరపరిచితుడు. అనారోగ్యం కారణంగా కొంత కాలంగా ఆయన ఇంటి వద్దనే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ ఆయన ఫోనుకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తమకు ఎటువంటి పెంపు వద్దని ఆయన ఫోన్ పెట్టేసినా.. వెంటనే కొన్ని ఓటీపీలు వచ్చాయి. వాటిని చూసుకుంటూ ఉండగానే క్రెడిట్ కార్డు నుంచి రూ.1,61,00లు కట్ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. తాము ఎటువంటి లావాదేవీలు చేయకపోయినా క్రెడిట్ కార్డులో నుంచి డబ్బు విత్‌డ్రా కావడంతో.. ఆ విషయాన్ని బ్యాంకు సిబ్బందికి తెలియజేశారు. బ్యాంకు సిబ్బంది సూచన మేరకు బుధవారం పీలేరు పోలీసులు, రాయచోటిలోని సైబర్ విభాగానికి ఫిర్యాదు చేశారు.

ఉరి వేసుకుని యువకుడు మృతి

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని బూర్లపల్లెకు చెందిన పల్లపు వెంకట్రమణ, రవణమ్మ దంపతుల కుమారుడు సతీశ్‌కుమార్ (22) మంగళవారం రాత్రి బూర్లపల్లెలోని నివాసం ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కాగా, మృతుడి సోదరుడు సైతం ఐదేళ్ల క్రితం ఉరి వేసుకునే మృతి చెందాడు. ఇద్దరు కొడుకులు మృతి చెందడంతో తల్లితండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. యువకుడి ఆత్మహత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టైరు పగిలి వాహనం బోల్తా ..

చిన్నమండెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై దేవపట్ల క్రాస్ రోడ్డు వద్ద బుధవారం తెల్లవారు జామున 3 గంటల సమ యంలో వెనుక టైర్లు పేలి పోవడంతో బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సమయంలో అటుగా ఏ వాహ నం రాక పోవడంతో ప్రమాదం తప్పింది. మదనపల్లి వైపు నుంచి కడప వైపునకు నారు తీసుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు ఎవరికీ గాయాలు కాలేదని తెలిపారు.


బోల్తాపడ్డ బొలెరో వాహనం

కలికిరి పెద్ద చెరువుకు 'ఇసుక పరీక్ష'

కలికిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కలికిరి పెద్ద చెరువు కట్ట నెర్రెలు చీలి కుంగడంతో కారణాలు నిర్ధారించడానికి జలవనరుల శాఖ ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు. చెరువు కట్ట కుంగి ప్రమాదంలో ఉందన్న ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన ఆ శాఖ ఇంజనీర్ల బృందం సోమవారం కట్టను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయాలని నిర్ధారణకు వచ్చారు. ఈ ప్రతిపాదనలపై నిపుణుల అభిప్రాయం కోరగా, కట్ట మీద పడిన నెర్రెలు కట్టకు సంబంధించినవా.. లేక ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సంబంధించినవా అన్న విషయంపై నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. దీంతో మంగళవారం జలవనరుల శాఖ ఇంజనీరు శ్రీనివాసులు రెడ్డి నెర్రెలు పడ్డ పాంతంలో ఇసుక నింపారు. ఈ ఇసుక లోపలికి వెళుతుందా లేదా అన్న విషయాన్ని గమనించి తదుపరి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ లోగా రహదార్ల శాఖ ఇంజనీర్లకు కూడా సమాచారం అందజేసి కట్ట మీద వేసిన తారు రోడ్డును పరిశీలించాలని కోరినట్లు శ్రీనివాసులు రెడ్డి చెప్పారు.


కలికిరి పెద్దచెరువు కట్టమీద నెర్రెలుపడ్డ చోటు

గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకుల అరెస్ట్

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ ద్విచక్ర వాహనంలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బి.కొత్తకోట రోడ్డులో ఉన్న ఓ పెట్రోల్ బంకు వద్ద బుధవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు వెళుతుండడం గమనించి, వారిని తనిఖీ చేయగా గంజాయి లభించినట్లు తెలిపారు. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న మదనపల్లెకు చెందిన ఫారూక్(29), ఓ బాలుడు, ముదివేడుకు చెందిన హరీష్(19) ఉన్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ యువకులను చూపుతున్న పోలీసులు


మదనపల్లి: గంజాయి విక్రేతలను చూపుతున్న సీఐ మహమ్మద్ రఫీ

గంజాయి విక్రేతల అరెస్టు

మదనపల్లె అర్బన్ :గంజాయి విక్రయం కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు మదనపల్లె వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. బుధవారం స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. కురబలకోట మండలం, కసాయివీధికి చెందిన నజీర్ కుమారుడు కంపమల్లి మహమ్మద్ అనీఫ్ (22), మదనపల్లె పట్టణం చంద్రా కాలనీకి చెందిన దండు విజయ్‌కుమార్ (21) మంగళవారం సాయంత్రం బైక్‌పై గంజాయిని తీసుకుని బెంగళూరు రోడ్డు, బీటీ కళాశాల మైదానంలో అమ్మడానికి వెళుతుండగా అదుపులోకి తీసున్నామన్నారు. వారి నుంచి 2 కేజీల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న మదనపల్లెకు చెందిన సయ్యద్ ఖాసీంసాబ్ కుమారుడు జాఫర్ అలీ, చలపతి కుమారుడు శివకుమార్ పరారీలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అన్సర్‌బాషా, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ సభ్యులపై యాజమాన్యం దాడి

- కార్యాలయానికి తాళం వేసిన బాధితులు
- ఇరువర్గాలపై కేసులు నమోదు

మదనపల్లె అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): చిట్టీ పూర్తయినా నగదు చెల్లించకపోవడంతో సభ్యులు బుధవారం స్థానికా ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న కపిలేశ్వర చిట్‌ఫండ్ కార్యాలయానికి తాళాలు వేశారు. దీంతో చిట్‌ఫండ్ కంపెనీ యాజమాన్యం వారిపై దాడి చేసింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన రామమోహన్‌రెడ్డి, అతని భార్య రత్నమ్మ స్థానిక కపిలేశ్వర చిట్‌ఫండ్ కంపెనీలో 2020 సెప్టెంబరులో చెరో ఐదు లక్షలకు చిట్ వేశారు. కంతులు పూర్తయినా అందుకు సంబంధించిన మొత్తాన్ని చెల్లించకపోగా, పలుమార్లు అడిగినా యజమాని సీకే నాయుడు, మేనేజరు నరసింహులు స్పందించకపోవడంతో బుధవారం ఆ సంస్థ కార్యాలయానికి తాళాలు వేశారు. విషయం తెలుసుకున్న యజమాని ప్రొద్దుటూరు నుంచి మనుషులను రప్పించి తాళాలు పగులగొట్టారు. డబ్బు ఇస్తామని చెప్పి బాధితులను పిలిపించి దాడి చేసి గాయపరిచారు. ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చిట్‌ఫండ్ యాజమాని సీకే నాయుడు, మదనపల్లె కార్యాలయ మేనేజరు నరసింహులతోపాటు మరో పదిమంది పైన, బాధితులు రామమోహన్‌రెడ్డి, రత్నమ్మ తోపాటు మరో కొంతమందిపై కేసును నమోదు చేసినట్లు వివరించారు.

అక్రమంగా కుక్కలు పడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కుక్కలను పట్టి అడవికి తరలిస్తున్నారంటూ బసినికొండ గ్రామస్థులతో కలిసి సర్వోహం వెల్ షేడ్ ట్రస్టు నిర్వాహకుడు కె బి హరీష్ బుధవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏబీసీ చట్టాన్ని ఉల్లంఘిస్తూ మంగళవారం రాత్రి నుంచి మున్సిపల్ అధికారులు కుక్కలను పడుతున్నారని, ఇప్పటికే 70 కుక్కలను పట్టి వాహనంలో అడవికి తరలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బసినికొండ సమీపంలో కుక్కలను తరలిస్తున్న టెంపోను అడ్డుకుని మదనపల్లె తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ప్రమీల స్పందించలేదని, కుక్కలను తరలించినవారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనూరాధ, విజయలక్ష్మి, హరీశ్, అచ్యుత, జయశ్రీ, రవిరాం, కుసుమా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

మలకలచెరువు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువ కుడు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కాలు వపల్లెకు చెందిన ఖాదర్‌వలి కుమారుడు సాధిక్(20) బుధవారం ద్విచక్ర వాహనంలో ములకలచెరువుకు వెళుతుండగా చౌడసముద్రం వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలో పడడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిన చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.


తీవ్రంగా గాయపడ్డ సాధిక్

ఆక్రమణలను తొలగించండి

మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆక్రమణలను తొలగించాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ బుధవారం సబ్ కలెక్టర్ కల్యాణికి విన్నవించారు.అనంతరం మాట్లాడుతూ పట్టణంలోని బాహుదానది, కురవంక స్థలాలను చాలా మంది ఆక్రమించారన్నారు. ఈ ఆక్రమణలన్నింటినీ తొలగించాలన్నారు. ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలకు అప్రూవల్స్ ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిలానిబాషా, హరికృష్ణ, శశికుమార్, కిరణ్ పాల్గొన్నారు.

డ్రిప్ గగనమే...

ప్రభుత్వం సబ్సిడీతో అందించే డ్రిప్‌ను పొందాలంటే రైతులకు అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. నిబంధనల పేరుతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఒకరైతు పొలంలో పంట సాగుకు డ్రిప్ అవసరమని దరఖాస్తు చేసుకుంటే అదే పొలంలోనే డ్రిప్ ఏర్పాటు చేయాలని అధికారులు పట్టుబడుతున్నారు. అదైనా రైతుకు అవసరమైన మేర పరికరాలు ఇస్తున్నారా అంటే దానికి నిబంధనల పేరుతో కోత విధిస్తున్నారు.

- నిబంధనల పేరుతో...
- రైతులకు చుక్కలు చూపిస్తున్న అధికారులు
- ఏ పొలంలో పంట సాగో.. అక్కడే డ్రిప్
- డ్రిప్పుకోసం తగ్గిన దరఖాస్తులు

పులివెందుల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో ఉద్యానపంటల సాగుకు రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లె, తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో అరటి, చీనీ తదితర ఉద్యాన పంటలు విరివిగా సాగు చేస్తున్నారు. అలాగే రైతులు ఏ పంట అయినా సరే డ్రిప్ పద్ధతిలోనే సాగుకు ఉపక్రమిస్తున్నారు. ప్రస్తుతం బోరుబావుల కింద ఉల్లి, మిరప, టమోట ఇలా ఏ పంటలు అయినా డ్రిప్ పద్ధతిలోనే సాగుచేస్తున్నారు. దీంతో జిల్లాలో అన్ని ప్రాంతాల కన్నా ఎక్కువ పులివెందుల ప్రాంతంలో రైతులు ఎక్కువగా డ్రిప్‌పైనే ఆధారపడుతున్నారు.



నిబంధనలు తప్పనిసరి

కానీ గత ఏడాది కాలంగా అధికారులు నిబంధనలు కఠినతరం చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఒక రైతు ఐదు ఎకరాల్లో ఒక పంట సాగుకు అవసరమైన డ్రిప్‌కు దరఖాస్తు చేసుకుంటే ఆ రైతు ఆ డ్రిప్ పరికరాన్ని వినియోగించుకుంటున్నారా లేక బహిరంగ మార్కెట్‌లో అమ్మేస్తున్నారా అనే దానిపై ఎక్కువగా అధికారులు దృష్టిసారించేవారు. అంటే ఒక రైతుకు ఐదు ఎకరాలకు అవసరమైన డ్రిప్ పరికరాలు అవసరమైతే ప్రభుత్వం రైతు కావాల్సినంత మేర పరికరాలు అందివ్వదు. కానీ రైతులు ఆ ఐదు ఎకరాలతో పాటు మరో రైతు వద్ద నుంచి పాస్‌పుస్తకం తెచ్చుకొని దానిపైన మరో దరఖాస్తు చేసుకొని రైతుకు అవసరమైన పరికరాలు పొందేవారు. కానీ ప్రస్తుతం అలాంటి పద్ధతి కుదరదని అధికారులు తెగేసిచెబుతున్నారు.

ఏ పొలానికి దరఖాస్తు చేసుకుంటే...

రైతు ఏ పొలంలో ఏ పంట సాగుచేస్తున్నారో ఆ పొలానికి సంబంధించిన సర్వే నెంబర్లతో డ్రిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి. వేరొక సర్వే నెంబర్‌తో దరఖాస్తు చేసుకొని మరొక సర్వే నెంబర్‌లో డ్రిప్ అమర్చుతామంటే అందుకు అధికారులు ఒప్పుకోవడం లేదు. ఒక రైతు పత్తిపంట సాగుకు డ్రిప్ పరికరాలు అవసరమై దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇచ్చే పరికరాలు ఐదు ఎకరాలకు సరిపడవు. మిగిలిన డ్రిప్ పరికరాలను బహిరంగ మార్కెట్‌లో రైతు కొనాల్సి ఉంటుంది. గతంలో మరొక రైతుకు సంబంధించిన పాస్‌పుస్తకం ద్వారా రైతుకు అవసరమైన పరికరాలను పొందేవారు. కానీ ప్రస్తుతం వాటిని పక్కనపెడితే ఏ పొలంలో పంట సాగుచేస్తున్నారో ఆ పొలానికి మాత్రమే డ్రిప్ మంజూరు చేస్తామని అధికారులు అంటున్నారు. ఇది చాలా ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు.

నిబంధనలు సడలించాలి

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో డ్రిప్ పరికరాల ధరలు ఆకాశా న్నంటుతున్నాయి. గతంలో కొందరు డ్రిప్ కంపెనీల డీలర్లు బినామీ రైతులతో చేతులు కలిపి డ్రిప్ పరికరాలను బహిరంగ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్న ఉదంతాలు లేకపోలేదు. ఈ కారణంగా పంటలు సాగుచేసే నిజమైన రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఒక రైతుకు పలు సర్వేనెంబర్లపైన పది ఎకరాలు పొలం ఉంటే ఏడు ఎకరాల్లో డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకుంటే అది ఆ రైతు వినియోగించుకున్నారా లేదా అనేది చూడాలి. కానీ ఏ సర్వేనెంబర్‌లో దరఖాస్తు చేసుకుంటే అక్కడే ఏర్పాటు చేయాలనే నిబంధన సడలించాలని రైతులు కోరుతున్నారు.

గండికోట నుంచి మైలవరానికి 2వేల క్యూసెక్కులు విడుదల



గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి మంగళవారం 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 1800 క్యూసెక్కులు, చాగల్లు రిజర్వాయిర్ నుంచి పెన్నానది ద్వారా 400 క్యూసెక్కులు, వరద నీరు మరో 300 క్యూసె క్కులు వచ్చి చేరుతున్నట్లు ఈఈ తెలిపారు. కాగా తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజె క్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.285 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతుందని జలాశయ ఈఈ రమేష్ బుధవారం తెలిపారు. గండికోట జలాశయం నుంచి 2000 క్యూసెక్కుల నీరు వచ్చి మైలవరంలో చేరుతుండగా మైలవరం నుంచి పెన్నానదికి 4,300 క్యూసెక్కుల నీటిని వదలుతున్నామన్నారు. మైలవరం జలాశయం పూర్తి నీటి మట్టం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.1 టీఎంసీల నీరు నిలువ ఉందన్నారు. పై నుంచి ఇన్‌ఫ్లో పెరిగితే పెన్నానదికి మరింత నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.

జాతీయస్థాయిలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా యూనిట్ లీడర్ అహ్మాద్ ప్రతిభ



అవార్డు స్వీకరిస్తున్న అహ్మాద్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కన్నడ జిల్లా మంగుళూరు ఆళ్వాస్ విద్యాసంస్థలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రోబోటిక్స్, ఏఐ, స్టెమ్, యూఈపీ అంశాలపై వారం రోజుల పాటు జాతీయ వర్క్‌షాప్ జరిగింది. మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన కడప జిల్లా యూనిట్ లీడర్ అహమ్మద్ సగినాల ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యూనిట్ లీడర్ల మధ్య జరిగిన పోటీల్లో అహమ్మద్ సగినాల అత్యుత్తమ ప్రతిభతో గుర్తింపు పొందారు. జాతీయ కార్యాలయ గౌరవ అతిథులు మధుసూదన్ ఆవల, షిండియే తదితరుల చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. అంతేకాక రాష్ట్ర కంటిన్‌జెంట్ లీడర్ అవార్డు, బహుమతిని కూడా ఆయన అందుకోవడం విశేషం.

దేశానికే ఆదర్శం మధ్యాహ్న భోజన పథకం



స్మార్ట్‌కిచెన్‌లో వంటల వివరాలను అడిగి తెలుసుకుంటున్న నీతి అయోగ్ జాయింట్ సెక్రటరీ సిద్ధార్థజైన్

సీకేదిన్నె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం దేశానికే ఆదర్శవంతంగా ఉందని నీతిఅయోగ్ జాయింట్ సెక్రటరీ, వైఎస్ఆర్ కడప ఆకాంక్షిత జిల్లా ప్రాబరి అధికారి సిద్ధార్థజైన్ తెలిపారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం స్మార్ట్‌కిచెన్‌ను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్మార్ట్ కిచెన్‌ను సందర్శించి.. అక్కడ వంటల తీరు గురించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ దేశంలోనే తొలిసారిగా చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.56లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ అడ్వాన్స్ స్మార్ట్‌కిచెన్ ద్వారా ప్రతిరోజు 33 పాఠశాలలోని 1758 మంది విద్యార్థులకు రుచి, శుచికరమైన మధ్యాహ్న భోజనం అందుతోందన్నారు. డిసెంబరు చివరినాటికి 11 మండలాల్లో 33 స్మార్ట్ కిచెన్ల ద్వారా 1,24,689 మంది విద్యార్థులకు ఇదేరకమైన మంచి రుచి, శుచికరమైన పోషకాహారాన్ని అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో సీకేదిన్నెలో రెండు, జమ్మలమడుగులో రెండు, కడపలో ఒక స్మార్ట్ కిచెన్ల ద్వారా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద 136 పాఠశాలలకు చెందిన 10,332 మంది విద్యార్థులకు 13 ప్రత్యేక వాహనాల్లో ఆహారాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. న్యూట్రిషనిస్టు పర్యవేక్షణలో సోలార్ పవర్‌తో పనిచేసే ఈ స్మార్ట్‌కిచెన్‌తో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామన్నారు. స్మార్ట్ కిచెన్‌లో వంట తయారీ విధానం గురించి వంట నిర్వాహకులను నీతి అయోగ్ అధికారి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీపీ నోడల్ అధికారి జోయల్ విజయకుమార్, విద్యాశాఖ ఆర్‌జేడీ శ్యామ్యూల్, డీఈవో శంసుద్దీన్, హౌసింగ్ పీడీ రాజారత్నం, సమగ్ర శిక్ష ఏపీసీ, ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి ఉధృతికి దారి మూసివేత



పెన్నానది గుండా వెళ్లే వేపరాల, మైలవరం దారి మూసివేత

జమ్మలమడుగు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీపరిధిలోని మిఠాయిగిరి వీధి ఉర్దూ పాఠశాల సమీపం నుంచి పెన్నానది గుండా వేపరాల, మైలవరం వెళ్లే దారిని బుధవారం ఉదయాన్నే కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక సచివాలయ సిబ్బంది మూసివేశారు. తుఫాను కారణంగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు మైలవరం నుంచి పెన్నానది గుండా వరదనీటి ప్రవాహాన్ని బుధవారం ఉదయాన్నే పెంచారు. దీంతో పెన్నానదిలోకి వెళ్లే రహదారులకు కంపచెట్లు అడ్డంగా పెట్టి మూసివేశారు. గత రెండు నెలలకుపైగా కురిసిన భారీ వర్షాలకు వరద నీటి ఉధృతితో వేపరాల వద్ద జమ్మలమడుగు వద్ద రోడ్లు కోతకు గురయ్యాయి. అప్పటి నుంచి రాకపోకలు బంద్ అయ్యాయి. ప్రస్తుతం వరదనీరు విడుదల చేయడంతో ప్రమాదాలు జరుగకుండా దారిని మూసివేసినట్లు తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు.

ఆర్టీపీపీలో ఆగిన విద్యుదుత్పత్తి

ఎర్రగుంట్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలో బుధవారం విద్యుదుత్పత్తి నిలిపివేశారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్‌కు డిమాండ్ లేకపోవడంతో యూనిట్లను ఆపినట్లు సీఈ వాసుదేవరావు పేర్కొన్నారు. ఆర్టీపీపీలో మొత్తం ఆరు యూనిట్లలో 1,650 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుదుత్పత్తి జరుగుతోంది. అయితే మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలో పోల్స్ పడిపోవడం, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు డిమాండ్ కూడా లేకపోవడం, దీనికి తోడు జలవిద్యుత్ కూడా ఫుల్‌గా వస్తుండటంతో ఆర్టీపీపీలోని 1, 2, 3, 6 యూనిట్లలో విద్యుదుత్పత్తిని ఆపినట్లు సీఈ తెలిపారు. 5వ యూనిట్ ఇదివరకే ఓవరాయిలింగ్‌కోసం షట్‌డౌన్‌లో ఉంది. 210 మెగావాట్ల సామర్థ్యంగల 4వ యూనిట్‌లో లోడ్ తగ్గించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితి యథాస్థితికి రాగానే పై అధికారుల నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు మళ్లీ యూనిట్లను సర్వీసులోకి తీసుకుంటామన్నారు. ప్లాంటులో 1.5 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయన్నారు.

31లోపు ప్లే స్కూల్ రికగ్నైజేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రీ ప్రైమరీ (ప్లే స్కూల్) స్కూల్స్ రికగ్నైజేషన్ కోసం అక్టోబరు 31లోపు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని కడప మండల విద్యాశాఖ అధికారి హెచ్‌కే రఫిక్ అహమద్ ఒక ప్రకటనలో తెలిపారు. కడప మండల పరిధిలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తున్న ప్లే స్కూల్స్ అక్టోబరు 31లోపు చలానా కట్టి పర్మిషన్ చేయించుకోవాలని తెలిపారు. పర్మిషన్ తీసుకోని పాఠశాలలను మూసివేస్తామని తెలిపారు. పర్మిషన్ లేకుండా నిర్వహించే పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర వివరాలకు 9390129019 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వందశాతం ప్లేస్‌మెంట్ రావాలి

- వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యాలయంలో చదివే ప్రతి విద్యార్థి అత్యున్నత కంపెనీలలో ప్లేస్‌మెంట్‌కి ఎంపికయ్యేలా వారిని తీర్చిదిద్దాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయభారతి, సభ్యులు డాక్టర్ లలిత, డాక్టర్ గణేష్‌నాయక్‌లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా విద్యాలయంలో సంవత్సరాల వారీగా విద్యార్థుల వివరాలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి నైపుణ్యాలు అవసరమో గుర్తించి అందుకు తగ్గ శిక్షణలు ఇచ్చేందుకు వనరుల గురించి ఒక ప్రణాళికను రూపొందించాలని సూచించారు. విద్యార్థులకు ఇచ్చే అన్ని రకాల నైపుణ్యాలకు నిధులు వెచ్చిస్తామన్నారు. ఇక నుంచి జాతీయ, ప్రపంచస్థాయి కంపెనీలలో మన విద్యార్థులకు ఉద్యోగాలు లభించాలన్నారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సరిత, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాస్‌రావులు వారి వారి శాఖలో వచ్చిన ప్లేస్‌మెంట్‌లను వివరించారు. సమావేశంలో డాక్టర్ జి.హరినాథ్, అసోసియేట్ ప్రిన్సిపాల్ డాక్టర్ రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు సెప్టిక్ ట్యాంకు వాహనాలు మంజూరు

కడప ఎస్టీఆర్ సర్కిల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని సఫాయి కార్మికులకు సెప్టిక్ ట్యాంకు వాహనాలు మంజూరు చేయనున్నట్లు ఎస్సీ కార్పొరే షన్ ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల, మైదుకూరు మున్సిపాలిటీల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం కింద అందించే ఈ వాహనాలకు ఐదుగురు అర్హులైన అభ్యర్థులు ఒక గ్రూపుగా ఏర్పడి మున్సిపల్ కమిషనరు ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.



జార్ఖండ్ టస్సర్ సిల్క్స్ పురుగులు వైవీయూలో ప్రత్యక్షం



కడప ఎడ్యుకేషన్,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్ర అడవుల్లో కనిపించే టస్సర్ సిల్క్ పట్టు పురుగులు (ఆంధిరా మిల్లిగా) యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ప్రత్యక్షమయ్యాయి. జీవ వైవిధ్యానికి ప్రతీకగా వైవీయూ నిలుస్తోందని పరిశోధకులు తెలిపారు. నల్లమల, లంకమల అడవుల వృక్షజాతులను క్యాంపస్‌లో పెంచిన నేపథ్యంలో టెర్మినా లియా ఎలిపికా, టెర్మినాలియా అర్జునా వంటి చెట్లపై ఈ పురుగులు కనిపించాయి. పర్యావరణశాఖ విద్యార్థులు ఫీల్డ్‌వర్క్‌లో భాగంగా వీటిని గుర్తించారు. ఈ పురుగులు 5నుంచి 10 రోజులు మాత్రమే జీవిస్తాయని, 300 నుంచి 500 గుడ్లను పెట్టి అంతరించిపోతాయని, తర్వాత లార్వా, ప్యూప, కక్యూన్ దశల్లో టస్సర్ సిల్క్ ఉత్పత్తి జరుగుతుందని విద్యార్థులు అనిల్, సుమయిన యాస్మిన్ తెలిపారు.

పోలిశెట్టిపల్లెలో వ్యక్తి ఆత్మహత్య

చక్రాయపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభి గ్రామం పోలిశెట్టిపల్లెలో బుధవారం మధ్యాహ్నం సిద్దయ్య (50) ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..... సిద్దయ్యకు ఇంటి సమస్యలతో పాటు భూతగాదాలు ఉన్నాయి. దీనికితోడు అప్పులు ఎక్కువ కావడంతో దిక్కుతెలియని పరిస్థితిలో జీవితంపై విరక్తి చెంది నిప్పంటించుకున్నాడు. దీంతో అతనికి ప్రథమ చికిత్స చేయించి.. కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా, సిద్దయ్య భార్య కూడా ఇటీవలే అదే ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. సిద్దయ్యకు ఒక కూతురు ఉండగా... ఆమెకు వివాహం చేయడంతో అత్తగారి ఇంటి వద్ద ఉంటోంది.

దంపతులపై చీటింగ్ కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ బస్టాండు ప్రాంతానికి చెందిన దంపతులు ఓ ఉద్యోగికి ఇల్లు కొనిస్తామంటూ మోసగించడంపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. భాగ్యనగర్ కాలనీకి చెందిన మాలె శివరామిరెడ్డి ట్రాన్స్‌కోలో ఏడీగా పనిచేస్తున్నారు. ఆయనకు పెట్రోలు బంకు నిర్వహిస్తున్న రామచంద్రారెడ్డి, ఆయన భార్య శ్యామలతో పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో తక్కువ ధరకు స్థలం ఇప్పిస్తామంటూ దంపతులు మాయమాటలు చెప్పి శివరామిరెడ్డి వద్ద 2021లో రూ.54లక్షలు డబ్బులు తీసుకున్నారు. తీసుకున్న డబ్బులకు స్థలం చూపించకపోవడం, తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని శివరామిరెడ్డి కోరినా బెదిరింపులకు పాల్పడుతుండేవారు. ఈమేరకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో భార్యభర్తలపై చీటింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంధకారంలో ట్రిపుల్‌ఐటీ

- ఏడు జనరేటర్లు ఉన్నా... పట్టించుకోని అధికారులు
- మూడేళ్లుగా ముళ్లపొదల మధ్య ఉన్న వైనం

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ వైర్లు దెబ్బతిని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ట్రిపుల్‌ఐటీ అంధకారంగా మారింది. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో 6వేల మంది, పాత క్యాంపస్‌లో ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి చెందిన 2వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అక్కడ అధ్యాపకుల క్వార్టర్స్ కూడా ఉన్నాయి. ట్రిపుల్ ఐటీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయినపుడు వెంటనే జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేలా క్యాంపస్ మొత్తం ఏడు జనరేటర్లను ఏర్పాటు చేశారు. అయితే వాటిని పట్టించుకునేనాథుడే లేకపోవడంతో రెండు మూడేళ్లుగా పనిచేయడం లేదు. ముళ్లపొదల్లో పడేసినట్లుగా జనరేటర్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి కరెంటు సరఫరా నిలిచిపోయి విద్యుత్ లేక ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడ్డారు. కనీసం నీటి సరఫరాకు కూడా విద్యుత్ లేక అవస్థలు పడ్డారు. జనరేటర్ల నిర్వహణ గురించి గాలికి వదిలేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జనరేటర్లను మరమ్మత్తు చేయించి పనిచేసేలా ట్రిపుల్‌ఐటీ అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ఈ సమస్యను ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లోగా మరమ్మత్తులు చేయించి పనిచేసేలా చూస్తామన్నారు.



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పనిచేయని జనరేటర్లు

విద్యుత్ సిబ్బంది మరమ్మతు పనులు

ట్రిపుల్‌ఐటీలో మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ లైన్లకు ఏర్పడ్డ అంతరాయంతో ఓల్డ్ క్యాంపస్‌కు కరెంటు సరఫరా నిలిచిపోయింది. వేకువజామునే వేంపల్లె విద్యుత్ సిబ్బంది ట్రిపుల్‌ఐటీకి చేరుకొని యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపట్టారు. బుధవారం 10గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

భూ వివాదంతో ఘర్షణ

- నలుగురిపై కేసు నమోదు

పులివెందుల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో బుధవారం భూ వివాదంపై ఘర్షణ జరగడంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన శంకరప్ప, వెంగముని ఇరువురు భూ విషయమై ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణకు సంబంధించి శంకరప్ప ఫిర్యాదు మేరకు వెంగముని, గంగయ్య మరో ఇరువురు మహి ళలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

లింగాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండ్లవాగు గ్రామంలో గొడ్డలి వెంకటరాములు (60) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఎస్ఐ అనిల్ కుమార్ వివరాల మేరకు.. వెంకటరాములు తన ఇంటిలో బుధవారం విద్యుత్ స్విచ్‌బోర్డుకు మరమ్మత్తులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య అనంతమ్మ, కుమారుడు ఉన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వాన నీటిని తొలగించండి



తహసీల్దారు అమరేశ్వరికి వినతిపత్రం సమర్పిస్తున్న ప్రజలు

పెనగలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు నిల్వ చేరిన వాన నీటిని తొలగించాలని పెనగలూరు ఎగువ హరిజనవాడ, ఎగువ కొత్తపల్లె, ముస్లిం వీధుల్లో కాపురం ఉంటున్న 30 కుటుంబాల వారు బుధవారం పెనగలూరు తహసీల్దారు అమరేశ్వరి, టీడీపీ నాయకులు బీఎల్ నరసింహారెడ్డి, షామీర్‌బాషా, ఆకుల చిన్నాకు విన్నవించారు. దీంతో తహసీల్దారు అమరేశ్వరి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సమస్యను పరిష్కరించామన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సహకారంతో కాలనీ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ఉపాధి పనికి ఈకేవైసీ తప్పనిసరి



మాధవరంలో ఫొటోలు తీస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనికి వెళ్లాలంటే జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని రాయచోటి ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి, ఉపాధి హామీ ఏపీవో రమేశ్ అన్నారు. బుధవారం మాధవరం గ్రామంలో టెక్నికల్ అసిస్టెంట్ రామచంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్‌తో కలిసి ఈకేవైసీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాయచోటి మండలంలో 8793 ఆధార్ సీడింగ్ గానూ 7498 ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. గ్రామంలో 1998 గానూ 1842 ఈకేవైసీ పూర్తి చేసి 92 శాతం చేపట్టినట్లు తెలిపారు. వందశాతం పూర్తి చేసి ప్రతి ఒక్కరికీ పనులను కల్పిస్తామన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి



నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. వర్షాల వల్ల రైల్వే బ్రిడ్జి నుంచి అటు, ఇటు రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే నీటిని తొలగించాలని సర్పంచ్ నూకా జయపాల్‌రెడ్డికి సూచించారు. మండల కన్వీనర్ సాయికిశోర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు దుర్గ నాగేంద్ర, గంగన్న, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా వీధులు



దాసరి వీధి దుస్థితి

నందలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) :నందలూరు గ్రామ పంచాయతీలోని దాసరి వీధి, బ్రాహ్మణవీధి రొచ్చురొచ్చుగా మారాయి. చిన్నారులు, వృద్ధులు నడవడానికి ఇబ్బందిపడుతు న్నారు. వాననీటిలో మురుగునీరు కలిసి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు తెలిపారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి సమస్య తీర్చాలని విన్నవించారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు గంటా వాసు దేవయ్య మాట్లాడుతూ రూ.25 లక్షలతో సీసీ రోడ్డుకు ఎస్టిమేషన్ వేసి పంచాయతీ అప్రూవల్ చేసి కలెక్టర్‌కు పంపించినా పట్టించుకోవడంలేదన్నారు.

ఇరుకైన వీధులు.. ట్రాఫిక్‌తో ఇక్కట్లు



గాంధీ బజారులో స్తంభించిన ట్రాఫిక్... మార్కెట్ వీధిలో ట్రాఫిక్ జాం.. గాంధీబజారులో అడ్డంగా పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు (ఫైల్)

రాయచోటి(నేతాజీ సర్కిల్), అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీలో ఇరుకైన వీధులపై ఆటోల రాకపోకలతో ట్రాఫిక్ సమస్యలు ప్రజలను బేజారు పట్టిస్తున్నాయి. ఆటో వెనుక ఆటో ఇలా ఇరుకైన వీధుల్లో మనుషులు ఉన్నా లేకున్నా తిరగడంతో ప్రజలకు ట్రాఫిక్ సమస్యగా మారింది. దీనికితోడు ద్విచక్రవాహనాల రద్దీ కారణంగా మార్కెట్‌కు వెళ్లాలంటే బేజారవుతోందని పలువురు పేర్కొంటున్నారు. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ప్రధానంగా కంసలవీధి, గాంధీబజార్, మార్కెట్ వీధి, వీరభద్రస్వామి ఆలయం వీధి ఇరుకుగా ఉంటాయి. ఈ వీధులు వ్యాపార దుకాణాలకు నిలయాలుగా ఉంటాయి. ఇక్కడ ప్రతినిత్యం నిత్యవసర సరుకులు, కూరగాయలు, బట్టలు వివిధ వ్యాపారాలకు సంబంధించి ప్రజలు నిత్యం రద్దీగా ఉంటాయి. ద్విచక్రవాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బంది ఏర్పడుతోంది. అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయడంతోట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. ట్రాఫిక్ నిబంధనలను తెలియజేస్తూ పోలీసులు ప్రహార కాస్తుంటారు. అయితే మధ్యాహ్నం పోలీసులు లేని సమయంలో ట్రాఫిక్ సమస్యగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మధ్యాహ్నం సమయంలో ట్రాఫిక్ నిబంధనల అమలు కోసం పోలీసుశాఖ సిబ్బందిని ఏర్పాటు చేసి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి మండిపల్లి

● దప్పేపల్లె సర్పంచ్ టీడీపీలో చేరిక

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు.
దప్పేపల్లి సర్పంచ్ కేశవయ్య, పాలెం గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ బీదగాని గంగయ్య అనుచరులు సుమారు 50 కుటుంబాలు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో బుధవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి హయాంలో అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయ న్నారు. లక్కిరెడ్డిపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్, కోనంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

అభివృద్ధి పనుల పరిశీలన

రాయచోటిటౌన్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని జాతీయ రహదారి, రింగు రోడ్డు అభివృద్ధి పనులను బుధవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.7.5 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాయచోటి- కడప రోడ్డు నుంచి వేంపల్లి రోడ్డు, గాలివీడు రోడ్డు, మదనపల్లి రోడ్డు, పీలేరు రోడ్డు వరకు కూడా రింగు రోడ్డును డబుల్ లైన్‌గా వచ్చే ఆరు నెలల్లో పూర్తవుతుందన్నారు. ఎవ్వరికీ ఆటంకాలు లేకుండా 120 అడుగులు రోడ్డును మాత్రమే తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అధికారులు, ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్‌వలి, సురేశ్‌రెడ్డి, కొండారెడ్డి, జంగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు అందించాలి

చిన్నమండెం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తన స్వగృహం బోరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వినతిపత్రాలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి తక్షణమే అధికారులను ఆదేశించారు.

టీడీపీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

● పార్టీకి చెడ్డపేరు తెస్తే కఠిన చర్యలు ● రాజంపేట ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం పనిచేసిన వారికి పదవులు ఇచ్చి గుర్తింపు కల్పిస్తామని టీడీపీ రాజంపేట ఇన్‌చార్జి జగన్ మోహన్‌రాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుండుపల్లె మండలంలో తెలుగు దేశం పార్టీ ఎంతో బలోపేతంగా ఉందన్నారు. పార్టీ అంతర్గత విషయాలను పార్టీలోని పెద్దలతో మాట్లాడి పరిష్కరించుకోవాలి. అలా కాదని సోషల్ మీడియాలో పెట్టుకుని పార్టీకి చెడ్డ పేరు తెస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇకపై నెలలో రెండు రోజులు సుండుపల్లెలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం అక్కంపల్లి జగన్ కాలనీలో ఆయన పర్యటించారు. తమ కాలనీలో వసతులు కల్పించాలని స్థానికులు జగన్ మోహన్‌రాజు దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్ బాబు నాయుడు, పీఏసీఎస్ ఛైర్మన్లు రామనాథరెడ్డి, రమణయ్య, టీడీసీ సీనియర్ నాయకులు సురేశ్‌నాయుడు, మేకల మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

అసత్య ప్రచారాలు చేస్తే సహించేది లేదు

కుటుంబ సమస్యను టీడీపీ సమస్యగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టీడీపీ రాజంపేట ఇన్‌చార్జి జగన్‌మోహన్‌రాజు హెచ్చరించారు.
మంగళవారం సోషల్ మీడియా వేదికగా ఇద్దరు వ్యక్తులు వారి కుటుంబ సమస్యను టీడీపీ నాయకులు చేస్తున్నట్లు విష ప్రచారం చేసి తిరిగి అదేరోజు రాత్రి టీడీపీ నాయకులకు సంబంధం లేదని సోషల్ మీడియాలో షేర్ చేశారన్నారు. ఇష్ట ప్రకారం పార్టీ పేరును వాడుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐ శ్రీనివాసులు సమక్షంలో విచారించి రెవెన్యూ అధికారులతో మాట్లాడి నిజమైన వారసులకు ఆ భూమి అప్పజెప్పాలని లేదా ప్రభుత్వ స్థలం అయితే ఆ భూమిలో పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని ఆదేశించారు.

అదనపు ఎస్పీ సేవలు అభినందనీయం

రాయచోటిటౌన్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): గతంలో రాయచోటి అర్బన్ సీఐగా పనిచేసి పదోన్నతిపై కడప జిల్లా అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న ప్రకాశ్ బాబు సేవలు అభినందనీయమని స్వచ్ఛంద సంస్థల సభ్యులు కొనియాడారు.మంగళవారం రాత్రి రాయచోటి పట్టణంలోని పీసీఆర్ గ్రాండ్ కల్యాణ మండపంలో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఏఎస్పీ ప్రకాశ్‌బాబు ఎక్కడ పనిచేసినా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించారన్నారు. రాయచోటిలో అర్బన్ సీఐగా పనిచేసిన కాలంలో పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారన్నారు. బంగారు దుకాణాల అసోసియేషన్ కార్యదర్శి ఇర్షాద్‌అలీఖాన్, లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ వ్యవస్థాపకుడు పీఎస్ హరినాథరెడ్డి, లయన్ నాగేశ్వరరావు, బంగారు దుకాణాల యజమానులు సయ్యద్, జానకీరామ్, విజయ్ రెడీమేడ్ షాప్‌యజమాని కూనా విజయ్, దిగువ అబ్బవరం మాజీ వైస్ సర్పంచ్ తిరుపాల్ నాయుడు, మాజీ కౌన్సిలర్ చెంగా ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్పీ ప్రకాశ్‌బాబును సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు

గృహ నిర్మాణదారులకు అవకాశం : ఏఈ

ఓబులవారిపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : నూతన గృహాల నిర్మాణం కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పిందని హౌసింగ్ ఏఈ ఓబులేశు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద కొత్త ఇళ్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. హౌసింగ్ డిపార్టుమెంట్ ద్వారా లబ్ధిదారులకు రూ.1.20 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా 90 పనిదినాల కింద రూ.27 వేలు అలాగే టాయిలెట్ నిర్మాణానికి రూ.12 వేలు అధనంగా అందజేస్తారన్నారు. మొత్తం రూ.1.59 లక్షలు అందిస్తారన్నారు. దరఖాస్తులకు నవంబరు 5 ఆఖరు అని తెలిపారు.

కూలిన ఆలయ ప్రహరీ పరిశీలన

సుండుపల్లె, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సుండుపల్లెలోని పురాతన శివాలయం ప్రహరీ గోడ వర్షాల దెబ్బ కు కూలిపోయింది. దీంతో బుధవారం దేవదాయ, ధర్మాదాయశాఖ అన్నమయ్య జిల్లా అధికారి విశ్వనాథం సూచనల మేరకు ఆలయ కార్యనిర్వాహక అధికారి కొండారెడ్డి వర్షానికి కూలిన గోడను, దెబ్బతిన్న ప్రహరీని పరిశీలించారు. నిధులు మంజూరు చేసి ప్రహరీ నిర్మించాలని భక్తులు ఆలయ కార్యనిర్వాహక అకారి కొండారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

విరూపాక్ష స్వామి దర్శనం

సుండుపల్లె శివాలయ పరిశీలనకు వచ్చిన ఆలయ కార్యనిర్వాహక అధికారి కొండారెడ్డి విరూపాక్ష స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చక పూజారి హరికృష్ణ, అయ్యర్ గోత్ర నామార్చన చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.



కూలిన గోడ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆలయ ఈవో కొండారెడ్డి, భక్తులు

కార్తీక మాసోత్సవ ఫ్లెక్సీ ఆవిష్కరణ

రాజంపేట టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తిరుమల- తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో ఊటుకూరులో నిర్వహించనున్న కార్తీక మాసోత్సవాల ఫ్లెక్సీలను బుధవారం ఆవిష్కరించారు. ప్రోగ్రాం జిల్లా అసిస్టెంట్ డాక్టర్ గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, ఆలయ అర్చకుడు ఫణిభూషణరావు, ఆలయ నిర్వాహకులు నాగప్పధ్వీపతిరెడ్డి, బాలరాజు, సుబ్బరామరాజు, మూరి లక్ష్మీకర్‌రెడ్డి, రాయలపురాజు పెంచల్‌రాజు భక్తకన్నప్ప ఆరాధించిన శివాలయంలో ఈ ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. గురువారం నుంచి వారం రోజుల పాటు జరిగే ఈ కార్తీక మాస మహోత్సవ ధార్మికోపన్యాస కార్యక్రమాల్లో భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 వరకు ధార్మికోపన్యాసాలు, భజనలు ఉంటాయన్నారు. 5వ తేదీ బుధవారం కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.

ఎల్లమరాజు చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, సాయవికాస్‌రెడ్డి

చిట్వేలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో జిల్లాలో అతిపెద్ద రెండో చెరువు అయిన ఎల్లమరాజు చెరువును ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరువులో నీటి సామర్థ్యం, కట్ట అలుగులు, భద్రత కాలువల మరమ్మతులు వంటి అంశాలను స్థానిక నాయకులతో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాదాసు నరసింహ, శివరాజు, నాగేశ్వరరావు, మధు, మన్మథ, రియాజ్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మొంథా తుపాను ప్రభావంతో నిండిన వై.కోటను చెరువును ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ పరిశీలించారు. టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్ రెడ్డి, గ్రామస్థులతో కలిసి చెరువును పరిశీలించారు. టీడీపీ సీనియర్ నాయకులు బజార్ సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ అడపాల బాలాజీ, బాలాజీ, చిన్నఓరంపాడు టీడీపీ నాయకుడు పయ్యావుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ తెలిపారు. ఇటీవల ఏనుగులు, అడవి జంతువులు దాడులలో నష్టపోయిన రైతులకు బుధవారం నష్టపరిహారం చెక్కులను టీడీపీ మహిళ నాయకురాలు ముక్కా వరలక్ష్మితో కలిసి అందజేశారు. శ్యామలకు రూ.38,400 బండివాడల పూర్ణమ్మకు రూ.60 వేలు, కే.వెంకటరమణ రూ. 38,400 ఫారెస్ట్ అధికారులతో కలిసి అందజేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మీపతి సిబ్బంది బాలచంద్రుడు, ఎస్.చంద్రకళ, ఆర్.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో విద్యార్థులు పాలుపంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయరామయ్య

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజం సేవలో పాలుపంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జంద్రపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దోమకాటు ద్వారా వ్యాపించే వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, మెదడువాపు వంటి జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. నియంత్రణకు దోమతెరలు వాడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఫ్రైడే డ్రైడేను పాటించాలన్నారు. స్నానపు గదుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి తొట్లను ఆరబెట్టాలన్నారు. జ్వర లక్షణా లు ఉన్న వారు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రవీంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి, చంద్రశేఖర్, ప్రియదర్శిని, ఆరోగ్య కార్యకర్త, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన పోతుగుంట



సబ్‌కలెక్టర్‌ను సత్కరిస్తున్న పోతుగుంట రమేశ్‌నాయుడు

రాజంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ హెచ్ఎస్ భావనను శ్రీశైలం దేవస్థాన ఛైర్మన్ పోతుగుంట రమేశ్‌నాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి స్వామివారి వస్త్రంతో సత్కరించి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా రాజంపేట ప్రాంత విషయాలపై, కొత్త జిల్లాల ఏర్పాటుపె ఆయన చర్చించారు. అనంతరం శ్రీశైల దేవస్థానం స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడానికి రావాలని ఆహ్వానించామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ, ఉద్దండం సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

● అతికారి కృష్ణ



భోజన ప్యాకెట్లు అందజేస్తున్న జనసేన నాయకులు

సిద్దవటం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆకలి తీర్చడమే లక్ష్యమని జనసేనపార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు. మొంథా తుఫాను నేపథ్యంలో ఇబ్బందిపడుతున్న నిరుపేదలకు బుధవారం అన్నదానం చేశారు. మండలంలోని రామస్వామిపల్లె, గాంధీనగర్ ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు మధ్యాహ్నం, రాతి భోజన వసతి కల్పించారు.
ఈ సందర్భంగా టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పుత్తా రామచంద్రయ్య మాట్లాడుతూ తుఫా ను బాధితులకు భోజన వసతి ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. అసెంబ్లి అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు, కూటమి యువ నేత డేరంగుల శ్రీకాంత్, పార్లమెంట్ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి, ఎన్‌ఆర్‌ఐ చంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.



నామాల గుట్టపై కట్టిన ఇళ్లు

పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం.. ఊర్లకు ఊర్లు కట్టిస్తాం.. అంటూ గత ప్రభుత్వం తమను నట్టేట ముంచిందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటిన్నర సెంటు స్థలంలో, వారిచ్చిన మొత్తంతో పాటు అప్పు చేసి మరీ నిర్మించిన ఇళ్లు పూర్తి కాకపోవడంతో నష్టపోయామని అంటున్నారు. జగనన్న కాలనీల పేరుతో ఏర్పాటు చేసిన లేఅవుట్లు జనావాసాలకు దూరంగా అనువుగాని చోట గుట్టలు కొండల్లో ఉండడంతో అవి నివాసయోగ్యంగా లేవని నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

అనువుగాని చోట..

- అధిక శాతం అసంపూర్తి భవనాలే..
- అప్పుల పాలైన లబ్ధిదారులు
- పేదలను ముంచిన జగనన్న ప్రభుత్వం

జగనన్న లేఅవుట్‌లు!

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో సంబేపల్లె మండలంలో 17 లేఅవుట్లు వేసి, ఒక్కొక్కరికి 1.5 సెంట్లు చొప్పున పట్టాలిచ్చి 1,484 గృహాలు మంజూరు చేశారు. కాలనీలో గృహాలన్నీ ఒకే కొలతల్లో ఆదర్శంగా ఉండాలి. అయితే కొన్ని చోట్ల పలుకుబడి ఉన్న వాళ్లు ఒక్కొక్కరు రెండు, మూడు ప్లాట్లు ఆక్రమించుకొని పెద్ద పెద్ద గృహాలు కట్టడం ఈ వ్యవహారంలో అక్రమాలు చోటు చేసుకున్నాయనడానికి నిదర్శనం. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం. జగనన్న లేఅవుట్లకు కేటాయించిన స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్ పేరుతో పలువురు నాయకులు తొలి దశలోనే సొమ్ము చేసుకున్నారు. ఇసుక, సిమెంటు, కడ్డీలు గృహ అవసరాలకు ఉపయోగపడే సామగ్రి ధరలు అధికంగా ఉండడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోక అప్పులు చేసి కొంత మంది గృహాలు కట్టారు. కొంత మంది పునాది దశలోనే వదిలేశారు. మరికొంత మంది గోడలు పూర్తి చేసి, మరికొంత మంది మౌల్డింగ్ వేసి వదిలేశారు.

మన ఇళ్లు, మన గౌరవం..

గత వైసీపీ ప్రభుత్వంలో గృహాలు మంజూరైనా ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేక వివిధ దశల్లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో 'మన ఇళ్లు మన గౌరవం' పేరుతో లబ్ధిదారులకు రుణాలను అందించేలా డ్వాక్రా తరఫున ప్రోత్సాహం అందించింది. అయితే ఇప్పటికీ. 40 శాతం నిర్మాణాలు పూర్తి కాగా,



బండపై పునాది కోసం రాళ్లు తోలి వదిలేసిన దృశ్యం

. ఇంకా 60 శాతం వివిధ దశల్లో ఉన్నాయి. సంబేపల్లె మండలంలోని మోటకట్ల పంచాయతీలోని వడ్లపల్లి మార్గంలో 183 గృహాలకు లేఅవుట్‌లు వేసి, 120 మందికి గృహాల మంజూరు పత్రాలను అందించారు. అయితే, ఈ కాలనీలో పలువురు అనర్హులు పునాదులు వేసి వదిలేశారు. గృహాల పేరుతో వ్యాపారం చేసేందుకు కొంత మంది ఈ మార్గాన్ని ఎంచుకోవడంతో ఇప్పటికీ ఇక్కడ పునాదులే కనిపిస్తున్నాయి. సంబేపల్లె పంచాయతీ నామాల గుట్టపైన 40 గృహాలు మంజూరు చేసినా, ఆ ఇళ్లు ఇక్కడ నివాస యోగ్యంగా లేవు. దుద్యాల, దేవపట్ల, నారాయణరెడ్డిపల్లె, ఇలా చాలా గ్రామ పంచాయతీల్లో ఇదే పరిస్థితి.



గోడల స్థాయిలోనే నిలిచిపోయిన పనులు

భవనాలకు ఆర్థిక భరోసా



పూర్తికాని ఇండ్ల కోసం కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసాను కల్పించింది. బీసీ, ఎస్సీ, మైనా ర్టీ లబ్ధిదారులకు 50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు 75 వేల రూపాయలు చొప్పున సాయం అందించింది. మన ఇళ్లు, మన గౌరవం పేరుతో డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నా ఆర్థికంగా ఇబ్బందుల కారణంగా లబ్ధిదారులు ముందుకు రావడం లేదు.

- కూనాసి సుబ్బరాజుయాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్

కడప-బెంగుళూరు రైల్వే లైన్‌పై నిర్లక్ష్యం ఎందుకు?

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప-బెంగుళూరు బ్రాడ్ గేజ్ రైల్వే నిర్మాణంపై నిర్లక్ష్యం ఎందుకని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులపై అధికారులతో జరిగిన సమీక్షలో కడప-బెంగుళూరు రైల్వే నిర్మాణంపై చర్చించక పోవడం శోచనీయమని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3038 కోట్ల అంచనాతో 25 కిలోమీటర్ల పొడవున రైల్వేలైన్ వేసేలా కేంద్రం 50శాతం, రాష్ట్రం 50శాతం భరించేలా పనులు ప్రారంభమయ్యాయన్నారు. కడప నుంచి పెండ్లిమర్రి వరకు 22 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని, రూ.350కోట్లు ఖర్చు చేయగా, రూ.133కోట్లు రాష్ట్రం భరించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా రైల్వేలైన్‌పై దృష్టిసారించి నిధులు కేటాయించాలని సూచించారు.

మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి



వెంకటనారాయణ మృతదేహం

రామాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కింద పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాచపల్లి పంచాయతీ ఎగువ ఉప్పరపల్లికి చెందిన టేకూరి వెంకట నారాయణ(67) మదనపల్లిలో మగ్గం నేస్తుంటాడు.ఈ నెల 25వ తేదీన స్వగ్రామంలోని ఇంటికి వచ్చాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో మండల కేంద్రం సమీపంలో కిందపడడంతో తలకు, కాళ్లకు గాయాలై అక్కడే పడిపోయాడు. బుధవారం ఉదయం అతనిని గమనించిన స్థానికులు అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. రామాపురం పోలీసులు మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రెడిట్ కార్డు అప్‌గ్రేడ్ పేరుతో మోసం

పీలేరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు లిమిట్ పెంపు పేరుతో సైబర్ నేరగాళ్లు ఆ కార్డులోని రూ.1.61 లక్షలు కాజేసిన సంఘటన బుధవారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు పట్టణం నాగిరెడ్డి కాలనీకి చెందిన సాయి సత్యం వీఎస్ఎన్ సాయి సార్‌గా స్థానికంగా చిరపరిచితుడు. అనారోగ్యం కారణంగా కొంత కాలంగా ఆయన ఇంటి వద్దనే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ ఆయన ఫోనుకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తమకు ఎటువంటి పెంపు వద్దని ఆయన ఫోన్ పెట్టేసినా.. వెంటనే కొన్ని ఓటీపీలు వచ్చాయి. వాటిని చూసుకుంటూ ఉండగానే క్రెడిట్ కార్డు నుంచి రూ.1,61,00లు కట్ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. తాము ఎటువంటి లావాదేవీలు చేయకపోయినా క్రెడిట్ కార్డులో నుంచి డబ్బు విత్‌డ్రా కావడంతో.. ఆ విషయాన్ని బ్యాంకు సిబ్బందికి తెలియజేశారు. బ్యాంకు సిబ్బంది సూచన మేరకు బుధవారం పీలేరు పోలీసులు, రాయచోటిలోని సైబర్ విభాగానికి ఫిర్యాదు చేశారు.

ఉరి వేసుకుని యువకుడు మృతి

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని బూర్లపల్లెకు చెందిన పల్లపు వెంకట్రమణ, రవణమ్మ దంపతుల కుమారుడు సతీశ్‌కుమార్ (22) మంగళవారం రాత్రి బూర్లపల్లెలోని నివాసం ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కాగా, మృతుడి సోదరుడు సైతం ఐదేళ్ల క్రితం ఉరి వేసుకునే మృతి చెందాడు. ఇద్దరు కొడుకులు మృతి చెందడంతో తల్లితండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. యువకుడి ఆత్మహత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టైరు పగిలి వాహనం బోల్తా ..



బోల్తాపడ్డ బొలేరో వాహనం

చిన్నమండెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై దేవపట్ల క్రాస్ రోడ్డు వద్ద బుధవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో వెనుక టైర్లు పేలి పోవడంతో బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సమయంలో అటుగా ఏ వాహనం రాక పోవడంతో ప్రమాదం తప్పింది. మదనపల్లి వైపు నుంచి కడప వైపునకు నారు తీసుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు ఎవరికీ గాయాలు కాలేదని తెలిపారు.

కలికిరి పెద్ద చెరువుకు 'ఇసుక పరీక్ష'



కలికిరి పెద్దచెరువు కట్టమీద నెర్రెలుపడ్డ చోటు

కలికిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కలికిరి పెద్ద చెరువు కట్ట నెర్రెలు చీలి కుంగడంతో కారణాలు నిర్ధారించడానికి జలవనరుల శాఖ ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు. చెరువు కట్ట కుంగి ప్రమాదంలో ఉందన్న ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన ఆ శాఖ ఇంజనీర్ల బృందం సోమవారం కట్టను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయాలని నిర్ధారణకు వచ్చారు. ఈ ప్రతిపాదనలపై నిపుణుల అభిప్రాయం కోరగా, కట్ట మీద పడిన నెర్రెలు కట్టకు సంబంధించినవా.. లేక ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సంబంధించినవా అన్న విషయంపై నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. దీంతో మంగళవారం జలవనరుల శాఖ ఇంజనీరు శ్రీనివాసులు రెడ్డి నెర్రెలు పడ్డ పాంతంలో ఇసుక నింపారు. ఈ ఇసుక లోపలికి వెళుతుందా లేదా అన్న విషయాన్ని గమనించి తదుపరి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ లోగా రహదార్ల శాఖ ఇంజనీర్లకు కూడా సమాచారం అందజేసి కట్ట మీద వేసిన తారు రోడ్డును పరిశీలించాలని కోరినట్లు శ్రీనివాసులు రెడ్డి చెప్పారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకుల అరెస్ట్



గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ యువకులను చూపుతున్న పోలీసులు



మదనపల్లి: గంజాయి విక్రేతలను చూపుతున్న సీఐ మహమ్మద్ రఫీ

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ ద్విచక్ర వాహనంలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బి.కొత్తకోట రోడ్డులో ఉన్న ఓ పెట్రోల్ బంకు వద్ద బుధవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు వెళుతుండడం గమనించి, వారిని తనిఖీ చేయగా గంజాయి లభించినట్లు తెలిపారు. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న మదనపల్లెకు చెందిన ఫారూక్(29), ఓ బాలుడు, ముదివేడుకు చెందిన హరీష్(19) ఉన్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

మదనపల్లె అర్బన్ :గంజాయి విక్రయం కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు మదనపల్లె వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. బుధవారం స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. కురబలకోట మండలం, కసాయివీధికి చెందిన నజీర్ కుమారుడు కంపమల్లి మహమ్మద్ అనీఫ్ (22), మదనపల్లె పట్టణం చంద్రా కాలనీకి చెందిన దండు విజయ్‌కుమార్ (21) మంగళవారం సాయంత్రం బైక్‌పై గంజాయిని తీసుకుని బెంగళూరు రోడ్డు, బీటీ కళాశాల మైదానంలో అమ్మడానికి వెళుతుండగా అదుపులోకి తీసున్నామన్నారు. వారి నుంచి 2 కేజీల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న మదనపల్లెకు చెందిన సయ్యద్ ఖాసీంసాబ్ కుమారుడు జాఫర్ అలీ, చలపతి కుమారుడు శివకుమార్ పరారీలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అన్సర్‌బాషా, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ సభ్యులపై యాజమాన్యం దాడి

● కార్యాలయానికి తాళం వేసిన బాధితులు ● ఇరువర్గాలపై కేసులు నమోదు

మదనపల్లె అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): చిట్టీ పూర్తయినా నగదు చెల్లించకపోవడంతో సభ్యులు బుధవారం స్థానికా ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న కపిలేశ్వర చిట్‌ఫండ్ కార్యాలయానికి తాళాలు వేశారు. దీంతో చిట్‌ఫండ్ కంపెనీ యాజమాన్యం వారిపై దాడి చేసింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన రామమోహన్‌రెడ్డి, అతని భార్య రత్నమ్మ స్థానిక కపిలేశ్వర చిట్‌ఫండ్ కంపెనీలో 2020 సెప్టెంబరులో చెరో ఐదు లక్షలకు చిట్ వేశారు. కంతులు పూర్తయినా అందుకు సంబంధించిన మొత్తాన్ని చెల్లించకపోగా, పలుమార్లు అడిగినా యజమాని సీకే నాయుడు, మేనేజరు నరసింహులు స్పందించకపోవడంతో బుధవారం ఆ సంస్థ కార్యాలయానికి తాళాలు వేశారు. విషయం తెలుసుకున్న యజమాని ప్రొద్దుటూరు నుంచి మనుషులను రప్పించి తాళాలు పగులగొట్టారు. డబ్బు ఇస్తామని చెప్పి బాధితులను పిలిపించి దాడి చేసి గాయపరిచారు. ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చిట్‌ఫండ్ యాజమాని సీకే నాయుడు, మదనపల్లె కార్యాలయ మేనేజరు నరసింహులతోపాటు మరో పదిమంది పైన, బాధితులు రామమోహన్‌రెడ్డి, రత్నమ్మ తోపాటు మరో కొంతమందిపై కేసును నమోదు చేసినట్లు వివరించారు.

అక్రమంగా కుక్కలు పడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కుక్కలను పట్టి అడవికి తరలిస్తున్నారంటూ బసినికొండ గ్రామస్థులతో కలిసి సర్వోహం వెల్ షేడ్ ట్రస్టు నిర్వాహకుడు కె బి హరీష్ బుధవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏబీసీ చట్టాన్ని ఉల్లంఘిస్తూ మంగళవారం రాత్రి నుంచి మున్సిపల్ అధికారులు కుక్కలను పడుతున్నారని, ఇప్పటికే 70 కుక్కలను పట్టి వాహనంలో అడవికి తరలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బసినికొండ సమీపంలో కుక్కలను తరలిస్తున్న టెంపోను అడ్డుకుని మదనపల్లె తాలూకా పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ప్రమీల స్పందించలేదని, కుక్కలను తరలించినవారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనూరాధ, విజయలక్ష్మి, హరీశ్, అచ్యుత, జయశ్రీ, రవిరాం, కుసుమా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడ్డ సాధిక్

మలకలచెరువు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కాలువపల్లెకు చెందిన ఖాదర్‌వలి కుమారుడు సాధిక్(20) బుధవారం ద్విచక్ర వాహనంలో ములకలచెరువుకు వెళుతుండగా చౌడసముద్రం వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలో పడడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిన చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆక్రమణలను తొలగించండి

మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆక్రమణలను తొలగించాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ బుధవారం సబ్ కలెక్టర్ కల్యాణికి విన్నవించారు.అనంతరం మాట్లాడుతూ పట్టణంలోని బాహుదానది, కురవంక స్థలాలను చాలా మంది ఆక్రమించారన్నారు. ఈ ఆక్రమణలన్నింటినీ తొలగించాలన్నారు. ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలకు అప్రూవల్స్ ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిలానిబాషా, హరికృష్ణ, శశికుమార్, కిరణ్ పాల్గొన్నారు.

చెరువులకు జలకళ

మదనపల్లె టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ మదనపల్లె డివిజన్‌లో 357 చెరువులు నిండాయని ఈఈ సురేష్‌బాబు ప్రకటించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లోని 16 మండలాల్లో 1,959 చెరువులు ఉన్నాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దేరు, బాహుదా ప్రాజెక్టులు నిండి మొరవలు పోతున్నాయని, 357 చిన్న, పెద్ద చెరువులు నిండిపోయాయన్నారు. వీటితో పాటు 362 చెరువులు 75 శాతం నీటితో నిండాయని, 434 చెరువులు 50శాతం నిండాయన్నారు. 302 చెరువులు పాతిక శాతం మాత్రమే నిండాయన్నారు. పెద్దేరు, బాహుదా ప్రాజెక్టు వద్ద తమశాఖ అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, నిండిన చెరువుల కట్టల పరిస్థితిని రోజూ జలవనరులశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. ఎక్కడైనా చెరువు కట్టలు ప్రమాదకర స్థితిలో సమాచారం ఇవ్వాలని ఈఈ కోరారు.

డ్రోన్ల సాయంతో మందులు పిచికారీ చేయాలి

● కృషి విజ్ఞాన్ కేంద్రం సమన్వయకర్త అంకయ్య కుమార్



వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఒంటిమిట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : భూమిలో తేమ ఎక్కువగా ఉన్నందున డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేసి పంటను పాడుకోవాలని, కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్ సూచించారు. బుధవారం మండలంలోని నర్సన్నగారిపల్లె, గంగపేరూరు గ్రామాల్లో సాగుచేసిన వరిపైరును పరిశీలించారు. వర్షం కారణంగా వరికంకుల నుంచి గింజలు మొలకెత్తాయన్నారు. పడిపోయిన కంకుల్లోని గింజలు కూడా మొలకెత్తాయన్నారు. దీని నివారణకు ఒక లీటరు నీటికి 50 గ్రాముల చొప్పున ఉప్పును కలిపి పిచికారీ చేయాలన్నారు. నల్లగింజ, పొట్ట కుళ్ల, మానిపండు తెగుళ్ల, దోమ పోటు నివారణకు మందులు వాడాలన్నారు. పసుపులో దుంపకుళ్లు, ఆకుమచ్చ ఇనుప దాతువు లోప నివారణకు మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, మాధురి, యాస్మిన్, కృష్ణప్రియ, మండల వ్యవసాయాధికారి మంజుల రాణి, రైతులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన



మోడల్ స్కూల్‌లో డెస్కులను పరిశీలిస్తున్న కొండూరు శ్రీనివాసకుమార్‌రాజు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఆఫీసర్ కొండూరు శ్రీనివాసరాజు పరిశీలించారు. విద్యా కమిషనర్ విజయరామరాజు ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2026 మార్చిలో జరగబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలకు అన్నమయ్య జిల్లా లో 121 సెంటర్లు ఏర్పాటు చేశామని, అందులో కొన్ని సెంటర్లలో విద్యార్థులకు వసతులు, డెస్కులు, విద్యుత్, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై ఆరా తీస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, సూపరిండెంట్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నాగిరెడ్డిపల్లె విద్యార్థి



అశోక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కోమటిగుంట అశోక్ ఇటీవల జరిగిన అండర్-14 బాలుర వాలీబాల్ పోటీల్లో విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. బుధవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరి తదితరు లు అశోక్‌ను అభినందిస్తూ జ్ఞాపిక, పుస్తకం బహూకరించారు. రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచి పాఠశాలకు గుర్తింపును తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యా యుడు రాజేంద్ర పాల్గొన్నారు.

ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న శివకుమార్

బి.కొత్తకోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌లో బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాజమండ్రి ప్రాంతానికి చెందిన 20 మంది ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, 40 మంది బీట్ ఆఫీసర్లు శిక్షణ తరగతులలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలపై వారికి అవగాహన కల్పించారు. స్థానిక సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ హార్సిలీహిల్స్ చరిత్రను వారికి వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.


'పారిశుధ్య సమస్యలు రాకుండా చూడాలి'



వాల్మీకిపురంలో పంచాయతీ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

వాల్మీకిపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని డీఎల్‌పీఓ నాగరాజు సూచించారు. బుధవారం ఆయన స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బంది విధుల వివరాలను ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ తుఫాను వర్షం కారణంగా పట్టణంలో సమస్య లను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, తాగునీటి ఇబ్బందులను కూడా గుర్తిస్తూ ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. పంచాయతీ పరిధిలో వందశాతం బకాయిల వసూళ్లు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా చేసేలా వేగవంతం చేయాలన్నారు. అనంతరం స్థానికంగా పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓ రవీంద్రనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ ఎన్‌ఆర్‌ఐ ఆస్ట్రేలియా కోఆర్డినేటర్‌గా విలియంబాబు



మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా టీడీపీ ఎన్‌ఆర్‌ఐ ఐటీ కోఆర్డినేటర్‌గా మదనపల్లెకు చెందిన బోనాసి విలియం బాబు ఎన్నికయ్యారు. మంగళవారం ఆస్ట్రేలియా దేశంలోని మెల్‌బోర్న్‌లో నిర్వహించిన ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నూతన కమిటీ ఎన్నికలో అధ్యక్షురాలిగా పాలడుగు వినీల ఎన్నికవగా, విలియంబాబు ఐటీ, మీడియా కోఆర్డినేటర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మదనపల్లెలో టీడీపీ క్రిస్టియన్ మైనార్టీ టీడీపీ నేత బోనాసి జాన్‌బాబు మాట్లాడుతూ తమ కుమారుడు టీడీపీ ప్రతినిధిగా ఆస్ట్రేలియాలో తెలుగు వారికి సేవలందించేందుకు ఎన్నికవడం ఆనందంగా ఉందన్నారు. ఆస్ట్రేలియాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహంతో విలియం బాబు మరిన్ని కార్యక్రమాలు చేసేందుకు ముందుకు వెళుతున్నారన్నారు. విలియంబాబుకు మదనపల్లె క్రిస్టియన్ నేతలు అభినందనలు తెలిపారు.

డ్రిప్ గగనమే...

ప్రభుత్వం సబ్సిడీతో అందించే డ్రిప్‌ను పొందాలంటే రైతులకు అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. నిబంధనల పేరుతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఒకరైతు పొలంలో పంట సాగుకు డ్రిప్ అవసరమని దరఖాస్తు చేసుకుంటే అదే పొలంలోనే డ్రిప్ ఏర్పాటు చేయాలని అధికారులు పట్టుబడుతున్నారు. అదైనా రైతుకు అవసరమైన మేర పరికరాలు ఇస్తున్నారా అంటే దానికి నిబంధనల పేరుతో కోత విధిస్తున్నారు.

- నిబంధనల పేరుతో...
- రైతులకు చుక్కలు చూపిస్తున్న అధికారులు
- ఏ పొలంలో పంట సాగో.. అక్కడే డ్రిప్
- డ్రిప్పుకోసం తగ్గిన దరఖాస్తులు

పులివెందుల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో ఉద్యానపంటల సాగుకు రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లె, తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో అరటి, చీనీ తదితర ఉద్యాన పంటలు విరివిగా సాగు చేస్తున్నారు. అలాగే రైతులు ఏ పంట అయినా సరే డ్రిప్ పద్ధతిలోనే సాగుకు ఉపక్రమిస్తున్నారు. ప్రస్తుతం బోరుబావుల కింద ఉల్లి, మిరప, టమోట ఇలా ఏ పంటలు అయినా డ్రిప్ పద్ధతిలోనే సాగుచేస్తున్నారు. దీంతో జిల్లాలో అన్ని ప్రాంతాల కన్నా ఎక్కువ పులివెందుల ప్రాంతంలో రైతులు ఎక్కువగా డ్రిప్‌పైనే ఆధారపడుతున్నారు.



నిబంధనలు తప్పనిసరి

కానీ గత ఏడాది కాలంగా అధికారులు నిబంధనలు కఠినతరం చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఒక రైతు ఐదు ఎకరాల్లో ఒక పంట సాగుకు అవసరమైన డ్రిప్‌కు దరఖాస్తు చేసుకుంటే ఆ రైతు ఆ డ్రిప్ పరికరాన్ని వినియోగించుకుంటున్నారా లేక బహిరంగ మార్కెట్‌లో అమ్మేస్తున్నారా అనే దానిపై ఎక్కువగా అధికారులు దృష్టిసారించేవారు. అంటే ఒక రైతుకు ఐదు ఎకరాలకు అవసరమైన డ్రిప్ పరికరాలు అవసరమైతే ప్రభుత్వం రైతు కావాల్సినంత మేర పరికరాలు అందివ్వదు. కానీ రైతులు ఆ ఐదు ఎకరాలతో పాటు మరో రైతు వద్ద నుంచి పాస్‌పుస్తకం తెచ్చుకొని దానిపైన మరో దరఖాస్తు చేసుకొని రైతుకు అవసరమైన పరికరాలు పొందేవారు. కానీ ప్రస్తుతం అలాంటి పద్ధతి కుదరదని అధికారులు తెగేసిచెబుతున్నారు.

ఏ పొలానికి దరఖాస్తు చేసుకుంటే...

రైతు ఏ పొలంలో ఏ పంట సాగుచేస్తున్నారో ఆ పొలానికి సంబంధించిన సర్వే నెంబర్లతో డ్రిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి. వేరొక సర్వే నెంబర్‌తో దరఖాస్తు చేసుకొని మరొక సర్వే నెంబర్‌లో డ్రిప్ అమర్చుతామంటే అందుకు అధికారులు ఒప్పుకోవడం లేదు. ఒక రైతు పత్తిపంట సాగుకు డ్రిప్ పరికరాలు అవసరమై దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇచ్చే పరికరాలు ఐదు ఎకరాలకు సరిపడవు. మిగిలిన డ్రిప్ పరికరాలను బహిరంగ మార్కెట్‌లో రైతు కొనాల్సి ఉంటుంది. గతంలో మరొక రైతుకు సంబంధించిన పాస్‌పుస్తకం ద్వారా రైతుకు అవసరమైన పరికరాలను పొందేవారు. కానీ ప్రస్తుతం వాటిని పక్కనపెడితే ఏ పొలంలో పంట సాగుచేస్తున్నారో ఆ పొలానికి మాత్రమే డ్రిప్ మంజూరు చేస్తామని అధికారులు అంటున్నారు. ఇది చాలా ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు.

నిబంధనలు సడలించాలి

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో డ్రిప్ పరికరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గతంలో కొందరు డ్రిప్ కంపెనీల డీలర్లు బినామీ రైతులతో చేతులు కలిపి డ్రిప్ పరికరాలను బహిరంగ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్న ఉదంతాలు లేకపోలేదు. ఈ కారణంగా పంటలు సాగుచేసే నిజమైన రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఒక రైతుకు పలు సర్వేనెంబర్లపైన పది ఎకరాలు పొలం ఉంటే ఏడు ఎకరాల్లో డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకుంటే అది ఆ రైతు వినియోగించుకున్నారా లేదా అనేది చూడాలి. కానీ ఏ సర్వేనెంబర్‌లో దరఖాస్తు చేసుకుంటే అక్కడే ఏర్పాటు చేయాలనే నిబంధన సడలించాలని రైతులు కోరుతున్నారు.

గండికోట నుంచి మైలవరానికి 2వేల క్యూసెక్కులు విడుదల



గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి మంగళవారం 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 1800 క్యూసెక్కులు, చాగల్లు రిజర్వాయిర్ నుంచి పెన్నానది ద్వారా 400 క్యూసెక్కులు, వరద నీరు మరో 300 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నట్లు ఈఈ తెలిపారు. కాగా తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.285 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతుందని జలాశయ ఈఈ రమేష్ బుధవారం తెలిపారు. గండికోట జలాశయం నుంచి 2000 క్యూసెక్కుల నీరు వచ్చి మైలవరంలో చేరుతుండగా మైలవరం నుంచి పెన్నానదికి 4,300 క్యూసెక్కుల నీటిని వదలుతున్నామన్నారు. మైలవరం జలాశయం పూర్తి నీటి మట్టం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.1 టీఎంసీల నీరు నిలువ ఉందన్నారు. పై నుంచి ఇన్‌ఫ్లో పెరిగితే పెన్నానదికి మరింత నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.

వరద నీటి ఉధృతికి దారి మూసివేత

పెన్నానది గుండా వెళ్లే వేపరాల, మైలవరం దారి మూసివేత



జమ్మలమడుగు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీపరిధిలోని మిఠాయిగిరి వీధి ఉర్దూ పాఠశాల సమీపం నుంచి పెన్నానది గుండా వేపరాల, మైలవరం వెళ్లే దారిని బుధవారం ఉదయాన్నే కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక సచివాలయ సిబ్బంది మూసివేశారు. తుఫాను కారణంగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు మైలవరం నుంచి పెన్నానది గుండా వరదనీటి ప్రవాహాన్ని బుధవారం ఉదయాన్నే పెంచారు. దీంతో పెన్నానదిలోకి వెళ్లే రహదారులకు కంపచెట్లు అడ్డంగా పెట్టి మూసివేశారు. గత రెండు నెలలకుపైగా కురిసిన భారీ వర్షాలకు వరద నీటి ఉధృతితో వేపరాల వద్ద జమ్మలమడుగు వద్ద రోడ్లు కోతకు గురయ్యాయి. అప్పటి నుంచి రాకపోకలు బంద్ అయ్యాయి. ప్రస్తుతం వరదనీరు విడుదల చేయడంతో ప్రమాదాలు జరుగకుండా దారిని మూసివేశారు. పెన్నానది పరిసర ప్రాంతాలకు ఎవరూ వెళ్లరాదని తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు.

జాతీయస్థాయిలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా యూనిట్ లీడర్ అహ్మద్ ప్రతిభ



అవార్డు స్వీకరిస్తున్న అహ్మద్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కన్నడ జిల్లా మంగుళూరు ఆళ్వాస్ విద్యాసంస్థలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రోబోటిక్స్, ఏఐ, స్టెమ్, యూతఈపీ అంశాలపై వారం రోజుల పాటు జాతీయ వర్క్‌షాప్ జరిగింది. మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన కడప జిల్లా యూనిట్ లీడర్ అహమ్మద్ సగినాల ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యూనిట్ లీడర్ల మధ్య జరిగిన పోటీల్లో అహమ్మద్ సగినాల అత్యుత్తమ ప్రతిభతో గుర్తింపు పొందారు. జాతీయ కార్యాలయ గౌరవ అతిథులు మధుసూదన్ ఆవల, షిండియే తదితరుల చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. అంతేకాక రాష్ట్ర కంటిన్‌జెంట్ లీడర్ అవార్డు, బహుమతిని కూడా ఆయన అందుకోవడం విశేషం.

దేశానికే ఆదర్శం మధ్యాహ్న భోజన పథకం



స్మార్ట్‌కిచెన్‌లో వంటల వివరాలను అడిగి తెలుసుకుంటున్న నీతి అయోగ్ జాయింట్ సెక్రటరీ సిద్దార్థజైన్

సీకేదిన్నె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం దేశానికే ఆదర్శవంతంగా ఉందని నీతిఅయోగ్ జాయింట్ సెక్రటరీ, వైఎస్ఆర్ కడప ఆకాంక్షిత జిల్లా ప్రాబరి అధికారి సిద్దార్థజైన్ తెలిపారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం స్మార్ట్‌కిచెన్‌ను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్మార్ట్ కిచెన్‌ను సందర్శించి.. అక్కడ వంటల తీరు గురించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ దేశంలోనే తొలిసారిగా చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.56లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ అడ్వాన్స్ స్మార్ట్‌కిచెన్ ద్వారా ప్రతిరోజు 33 పాఠశాలలోని 1758 మంది విద్యార్థులకు రుచి, శుచికరమైన మధ్యాహ్న భోజనం అందుతోందన్నారు. డిసెంబరు చివరినాటికి 11 మండలాల్లో 33 స్మార్ట్ కిచెన్ల ద్వారా 1,24,689 మంది విద్యార్థులకు ఇదేరకమైన మంచి రుచి, శుచికరమైన పోషకాహారాన్ని అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో సీకేదిన్నెలో రెండు, జమ్మలమడుగులో రెండు, కడపలో ఒక స్మార్ట్ కిచెన్ల ద్వారా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద 136 పాఠశాలలకు చెందిన 10,332 మంది విద్యార్థులకు 13 ప్రత్యేక వాహనాల్లో ఆహారాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. న్యూట్రిషనిస్టు పర్యవేక్షణలో సోలార్ పవర్‌తో పనిచేసే ఈ స్మార్ట్‌కిచెన్‌తో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామన్నారు. స్మార్ట్ కిచెన్‌లో వంట తయారీ విధానం గురించి వంట నిర్వాహకులను నీతి అయోగ్ అధికారి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీపీ నోడల్ అధికారి జోయల్ విజయకుమార్, విద్యాశాఖ ఆర్‌జేడీ శ్యామ్యూల్, డీఈవో శంసుద్దీన్, హౌసింగ్ పీడీ రాజారత్నం, సమగ్ర శిక్ష ఏసీపీ, ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ప్లేస్‌మెంట్ రావాలి

- వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యాలయంలో చదివే ప్రతి విద్యార్థి అత్యున్నత కంపెనీలలో ప్లేస్‌మెంట్‌కి ఎంపికయ్యేలా వారిని తీర్చిదిద్దాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయభారతి, సభ్యులు డాక్టర్ లలిత, డాక్టర్ గణేష్‌నాయక్‌లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా విద్యాలయంలో సంవత్సరాల వారీగా విద్యార్థుల వివరాలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి నైపుణ్యాలు అవసరమో గుర్తించి అందుకు తగ్గ శిక్షణలు ఇచ్చేందుకు వనరుల గురించి ఒక ప్రణాళికను రూపొందించాలని సూచించారు. విద్యార్థులకు ఇచ్చే అన్ని రకాల నైపుణ్యాలకు నిధులు వెచ్చిస్తామన్నారు. ఇక నుంచి జాతీయ, ప్రపంచస్థాయి కంపెనీలలో మన విద్యార్థులకు ఉద్యోగాలు లభించాలన్నారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సరిత, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాస్‌రావులు వారి వారి శాఖలో వచ్చిన ప్లేస్‌మెంట్‌లను వివరించారు. సమావేశంలో డాక్టర్ జి.హరినాథ్, అసోసియేట్ ప్రిన్సిపాల్ డాక్టర్ రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు సెప్టిక్ ట్యాంకు వాహనాలు మంజూరు

కడప ఎన్జీఆర్ సర్కిల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని సఫాయి కార్మికులకు సెప్టిక్ ట్యాంకు వాహనాలు మంజూరు చేయనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల, మైదుకూరు మున్సిపాలిటీల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం కింద అందించే ఈ వాహనాలకు ఐదుగురు అర్హులైన అభ్యర్థులు ఒక గ్రూపుగా ఏర్పడి మున్సిపల్ కమిషనరు ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.



జార్ఖండ్ టస్సర్ సిల్క్ పురుగులు వైవీయూలో ప్రత్యక్షం

కడప ఎడ్యుకేషన్,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్ర అడవుల్లో కనిపించే టస్సర్ సిల్క్ (పట్టు పురుగులు) (ఆంధి రా మిల్లిగా) యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ప్రత్యక్ష మయ్యాయి. జీవ వైవిధ్యానికి ప్రతీకగా వైవీయూ నిలుస్తోందని పరిశోధకులు తెలిపారు. నల్లమల, లంకమల అడవుల వృక్షజాతులను క్యాంపస్‌లో పెంచిన నేపథ్యంలో టెర్మినాలియా ఎలిపికా, టెర్మినాలియా అర్జునా వంటి చెట్లపై ఈ పురుగులు కనిపించాయి. పర్యావరణశాఖ విద్యార్థులు ఫీల్డ్‌వర్క్‌లో భాగంగా వీటిని గుర్తించారు. ఈ పురుగులు 5నుంచి 10 రోజులు మాత్రమే జీవిస్తాయని, 300 నుంచి 500 గుడ్లను పెట్టి అంతరించిపోతాయని, తర్వాత లార్వా, ప్యూప, కక్యూన్ దశల్లో టస్సర్ సిల్క్ ఉత్పత్తి జరుగుతుందని విద్యార్థులు అనిల్, సుమయిన యాస్మిన్ తెలిపారు.



పురుగులు నివాసంతంటే అర్జున చెట్టు

దంపతులపై చీటింగ్ కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ బస్టాండు ప్రాంతానికి చెందిన దంపతులు ఓ ఉద్యోగికి ఇల్లు కొనిస్తామంటూ మోసగించడంపై ఛీటింగ్ కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. భాగ్యనగర్ కాలనీకి చెందిన మాలె శివరామిరెడ్డి ట్రాన్స్‌కోలో ఏడీగా పనిచేస్తున్నారు. ఆయనకు పెట్రోలు బంకు నిర్వహిస్తున్న రామచంద్రారెడ్డి, ఆయన భార్య శ్యామలతో పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో తక్కువ ధరకు స్థలం ఇప్పిస్తామంటూ దంపతులు మాయమాటలు చెప్పి శివరామిరెడ్డి వద్ద 2021లో రూ.54లక్షలు డబ్బులు తీసుకున్నారు. తీసుకున్న డబ్బులకు స్థలం చూపించకపోవడం, తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని శివరామిరెడ్డి కోరినా బెదిరింపులకు పాల్పడుతుండేవారు. బాధితుడి ఫిర్యాదు చేయడంతో భార్యభర్తలపై ఛీటింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): చీకిలబైలులో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ప్రజల నుంచి స్పందన వచ్చిందని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్, సర్పంచ్ ఎం.ప్రభాకర్ పేర్కొన్నారు. చీకిలబైలు సచివాలయంలో లయన్స్ అభయ క్లబ్, జాలప్ప హృదయాలయ ఆధ్వర్యంలో గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన ప్రజలకు మధుమేహం, బీపీ, గుండె సంబంధిత 2డీ ఎకో, ఈసీజీ పరీక్షలు చేశారు. లయన్స్ అభయ క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, సుబ్బారెడ్డి, చిన్నరెడ్డి, సంతోష్, కనుగొండ పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

మదనపల్లె అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేద్దామని జిల్లా కాంగ్రెస్‌పార్టీ మహిళా అధ్యక్షురాలు రెడ్డి నిహారా సుల్తానా, జిల్లా యువత అధ్యక్షుడు కొండిపల్లె ఆనంద్ పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ మునుస్వామినాయక్‌ను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించామన్నారు. నియోజకవర్గం ఇన్‌చార్జ్ మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు రాజశేఖర్, అబుజుబేర్, కిషోర్, శివశంకర, విజయకుమార్, అనిల్, శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలి

నిమ్మనపల్లి అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వారి ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ రమేష్, ఎంఈఓలు పద్మావతి, నారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆధార్ కార్డులో ఇంటి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు తప్పులుంటే సవరించు కోవచ్చన్నారు. టెన్త్ విద్యార్థులు ఆధార్‌లో వారి పేర్లు, చిరునామా సక్రమంగా వున్నాయని పరిశీలించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఖచ్చితంగా ఆధార్ అప్‌డేషన్ చేసుకోవాలని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, హెచ్‌ఎం అంజాద్, టీడీపీ నేతలు రాజన్న, శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

బాల ఆధార్ కేంద్రాలు...

తంబళ్లపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాల ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ త్యాగరాజు పేర్కొన్నారు. టెన్త్ విద్యార్థుల ఆధార్‌లో తప్పులుండడం, ఆధార్ అప్డేట్ లేకపోవడంతో నామినల్ రోల్స్‌లో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఈ కేంద్రాల్లో ఆధార్ కార్డు అప్డేషన్, తప్పులు, సమస్యలు ఉంటే సరిచేసుకోవచ్చన్నారు. 31 వరకు బాల ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని విద్యార్థులు, తల్లితండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి



ఇట్నేనివారిపల్లెలో స్థానికులతో మాట్లాడుతున్న కొండ్రెడ్డి

తంబళ్లపల్లె, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం టీడీపీ కార్యకర్తలతో కలిసి ఇట్నేనివారిపల్లె, ఏటిగడ్డపల్లె, పరుసతోపు కాలనీల్లో పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడి అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఆయన వెంట టీడీపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

గంగమ్మ జాతరకు డీఎస్పీకి ఆహ్వానం

మదనపల్లె అర్బన్, మే29(ఆంధ్రజ్యోతి): నవంబరు 3,4 తేదీల్లో నిర్వహిస్తున్న కోర్టులో గంగమ్మ జాతరకు డీఎస్పీ మహేంద్రను కమిటీ సభ్యులు ఆహ్వానించారు. వేలాదిగా భక్తులు విచ్చేసే జాతరకు బందోబస్తు కల్పించాలని కోరారు. అత్యంత వైభవంగా జరిగే జాతరకు అనుమతి ఇవ్వాలని ఆలయ కమిటీ సభ్యులు మార్పూరి ప్రభాకర్ నాయుడు, పెరవలి వేణుగోపాల్ నాయుడు, కరుణాకర్ నాయుడు, మార్పూరి మహేష్ కోరారు.

అంధకారంలో ట్రిపుల్‌ఐటీ

- ఏడు జనరేటర్లు ఉన్నా... పట్టించుకోని అధికారులు
- మూడేళ్లుగా ముళ్లపొదల మధ్య ఉన్న వైనం



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పనిచేయని జనరేటర్లు

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ వైర్లు దెబ్బతిని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ట్రిపుల్‌ఐటీ అంధకారంగా మారింది. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో 6వేల మంది, పాత క్యాంపస్‌లో ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి చెందిన 2వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అక్కడ అధ్యాపకుల క్వార్టర్స్ కూడా ఉన్నాయి. ట్రిపుల్ ఐటీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయినపుడు వెంటనే జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేలా క్యాంపస్ మొత్తం ఏడు జనరేటర్లను ఏర్పాటు చేశారు. అయితే వాటిని పట్టించుకునేనాథుడే లేకపోవడంతో రెండు మూడేళ్లుగా పనిచేయడం లేదు. ముళ్లపొదల్లో పడేసినట్లుగా జనరేటర్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి కరెంటు సరఫరా నిలిచిపోయి విద్యుత్ లేక ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడ్డారు. కనీసం నీటి సరఫరాకు కూడా విద్యుత్ లేక అవస్థలు పడ్డారు. జనరేటర్ల నిర్వహణ గురించి గాలికి వదిలేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జనరేటర్లను మరమ్మత్తు చేయించి పనిచేసేలా ట్రిపుల్‌ఐటీ అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ఈ సమస్యను ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లోగా మరమ్మత్తులు చేయించి పనిచేసేలా చూస్తామన్నారు.

విద్యుత్ సిబ్బంది మరమ్మత్తు పనులు

ట్రిపుల్‌ఐటీలో మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ లైన్లకు ఏర్పడ్డ అంతరాయంతో ఓల్డ్ క్యాంపస్‌కు కరెంటు సరఫరా నిలిచిపోయింది. వేకువజామునే వేంపల్లె విద్యుత్ సిబ్బంది ట్రిపుల్‌ఐటీకి చేరుకొని యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపట్టారు. బుధవారం 10గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కన్నెత్తి చూడని ఎంపీటీసీలు

- ఎంపీపీ మినహా సభ్యులందరూ గైర్హాజరే
- కోరం లేక మండలమీట్ వాయిదా



మండల మీట్‌లో వేచివున్న అధికారులు

బి.కొత్తకోట, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): అనుకున్నట్టు గానే మండల సమావేశం వాయిదా పడింది. ఎంపీపీ లక్ష్మీనరసమ్మ మినహా సభ్యులెవరూ హాజరు కాకపోవడంతో నిర్ణీత గడువు వరకు వేచిచూసి అనంతరం సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌షకూర్ ప్రకటించారు. బుధవారం 11గంటలకు మండల సమావేశం నిర్వహించాలని అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలకు ముందస్తు సమాచారం అందించారు. అయినా ఎంపీటీసీలెవరూ హాజరు కాలేదు. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టినా ఎంపీటీసీలు ఓటింగ్ నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని మదనపల్లి సబ్‌కలెక్టర్ కళ్యాణిని కోరిన నేపథ్యంలో నవంబరు 12న బి.కొత్తకోట మండల పరిషత్ కార్యాలయంలో ఓటింగ్ నిర్వహించి ఎంపీపీ విషయంలో ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. మండల మీట్ నిర్వహణలో భాగంగా సీఐ గోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముసురు ముంచింది

వేరుశనగ రైతులకు దెబ్బ ● తగ్గుతున్న పంట దిగుబడి
కాయలకు మచ్చలు ● గిట్టుబాటు ధరలు అంతంత మాత్రమే



వర్షానికి పొలాల్లోనే ఉన్న వేరుశనగ పంట

కురబలకోట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం జిల్లాను చుట్టేసింది. ఈ ప్రభావం సోమవారం పెద్దగా కనిపించక పోయినా మంగళవారం ఉదయం నుంచీ ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో తడి వాతావరణం నెలకొంది. అంతేకాకుండా ఎడతెరిపిలేకుండా కురిసిన ముసురు వాన దెబ్బకి ఆరుగాలం కష్టపడి సాగు చేసిన వేరుశనగ రైతన్నకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. జిల్లాలో ప్రధానంగా రైతన్నలు సాగు చేసే పంటల్లో వేరుశనగకు ప్రత్యేకస్థానం. పూర్తిగా వర్షంపైనే ఆధారపడి పంటను సాగు చేస్తారు. కోరుకున్న స్థాయిలో వర్షపాతం నమోదైన, కాకపోయినా రైతన్నలు పంట సాగుపై మెగ్గుచూపి సాగు చేశారు. అయితే కష్టపడి సాగు చేసిన పంటలకు కనీసం గిట్టుబాటు ధరలు లేకపోవడం, పంట ఖర్చులు పెరిగిపోవడం, పంట చేతికి అందే సమయంలో ప్రకృతి పగపట్టడంతో వరుస నష్టాలను చవిచూస్తున్నారు. ఏటా సీజన్‌లో పంటను సాగు చేసి లాభాలను ఆర్జించవచ్చనే గంపెడాశతో ఎదురుచూస్తున్న రైతన్నలకు ఈ ఏడాది మళ్లీ నిరాశే ఎదురవుతోంది. దీంతో తీవ్ర నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితులు నెలకొనడంతో ఏటా పంటసాగు విస్తీర్ణం క్రమేణా తగ్గుతోంది. ఈ నేపథ్యంలో పంటపై చేసిన అప్పు, వడ్డీలు ఎలా తీర్చాలో తెలియక లోలోపల మదనపడుతూ కుమిలిపోతున్నారు.

జిల్లాలోని పడమటి ప్రాంతమండలాల్లో రైతన్నలు వ్యవసాయంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ప్రధానంగా రైతన్నలు వేరుశనగ పంటను సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది వర్షం తక్కువగా నమోదవడంతో వేరుశనగ సాగుపై రైతన్నలు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో విస్తీర్ణం బాగా తగ్గింది. ప్రధానం వేరుశనగ పంట సాగుకు జూలై ఆఖరు వరకు వర్షాలు పడితే మంచి అదునుగా భావించి సాగు చేస్తారు. అయితే ప్రభుత్వం రైతన్నలకు రాయితో కేవలం 30కిలోల బస్తా రూ.1674 రాయితో అరకొరగా పంపిణీ చేసింది. దీంతో సరైన సమయంలో సరిపడా విత్తనాలు లేకపోవడం, నాసిరకంగా విత్తన కాయలు ఉండడంతో పెద్దగా మొగ్గు చూపలేదు. అంతేకాక ఖర్చులు పెరిగిపోవడంతో ఎకరా పంట సాగు చేయడానికి రైతన్నలకు దున్నకం, విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు, కూలీలు, కలుపు తీయడం, పంటను పెరకడం తదితర వాటికి దాదాపుగా రూ.40-55 వేలు వరకు ఖర్చు వస్తోంది. తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోటలో 174 హెక్టార్లు, బి.కొత్తకోటలో 99హెక్టార్లు, తంబళ్లపల్లెలో 227 హెక్టార్లు, ములకలచెరువులో 540 హెక్టార్లు, పీటీఎంలో 336హెక్టార్లు, పెద్దమండ్యంలో 140 హెక్టార్లలో పంటను రైతన్నలు సాగు చేశారు. కాగా పంట దిగుబడి భారీగా తగ్గుముఖం పట్టడంతో ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు. ఎకరాకు 25బస్తాలు దిగుబడి వస్తాయని భావించిన రైతన్నలకు కేవలం 15నుంచి 20 బస్తాలు మాత్రమే చేతికి అందుతోంది. అంతేకాకుండా ముసురు వాన దెబ్బకి పంట కాయలకు మచ్చలు రావడంతో కొనేనాధుడు కరవయ్యాడు. దీంతో మార్కెట్‌లో 43కిలోల బస్తా రూ. 1800నుంచి 2300మధ్య అమ్ముబలుకుతోంది. అంతేకాకుండా ముసురు వాన దెబ్బకి చాలా మంది రైతులు వేరుశనగ పంటను పీకి పొలాల్లోనే వదిలేయడంతో వర్షానికి తడవడంతో ముగ్గపడుతున్నాయి. పశుగ్రాసం సైతం కుళ్లిపోతోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో పంట దిగుబడి ఏమాత్రం చేతికి అంది నష్టాల నుంచి రైతన్నలు ఎలా గట్టెక్కుతారో వేచి చూడాల్సి ఉంది. ప్రభుత్వం ఆదుకుని వేరుశనగ రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



అంతంత మాత్రంగానే కాసిన కాయలు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు
పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కోటి సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే

పీలేరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం యర్రగుంటపల్లె, కాకులారంపల్లె, వేపుభైలు పంచాయతీల్లో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ చేపట్టిన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంతో పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోందని ఆరోపించారు. వాస్తవ పరిస్థితులను గుర్తించి ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దండు జగన్‌మోహన్‌రెడ్డి, నేతలు ఎం. భానుప్రకాష్‌రెడ్డి, ఎం. మధుసూదన రెడ్డి, చంద్రా రెడ్డి, చక్రధర్, నారే వెంకట్రమణారెడ్డి, వినోద్‌కుమార్, వీ.పీ రమేష్ రెడ్డి, లోకనాథ రెడ్డి, సురేష్‌కుమార్ రెడ్డి, గాయం నాగభూషణ రెడ్డి, ద్వారకనాథరెడ్డి, చలపతి, కాలనీ చిన్న తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా కోటపల్లె బాబు జన్మదిన వేడుకలు

పీలేరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లె బాబు రెడ్డి జన్మదినం అట్టహాసంగా జరిగింది. పీలేరు మండల టీడీపీ శ్రేణులు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో భారీ కేక్‌లు కట్ చేసి ప్రజలకు పంచారు. ఆయన జన్మదినం సందర్భంగా తెలుగు యువత నేత స్పోర్ట్స్ మల్లి ఆధ్వర్యంలో నాలుగు రోడ్లు కూడలి, లక్ష్మీ వృద్ధాశ్రమంలో అన్నదానం చేయడమే కాకుండా, ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పాలు, పండ్లు పంచి పెట్టారు. యువ నేత బత్తుల ప్రసాద్ నేతృత్వంలో నాలుగు రోడ్ల కూడలిలో కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో రౌద్రాల అంకాలమ్మ ఆలయ చైర్మన్ రామకృష్ణా రెడ్డి, కోటపల్లె శ్రీనాథరెడ్డి, సురేంద్రనాథరెడ్డి, షౌకత్ అలీ, ఆది, చోటు, ఆంజి, లక్ష్మీకాంతమ్మ, షమ, పోలిశెట్టి సురేంద్ర, నరేశ్, సుభాష్, ఆనందస్వామి పాల్గొన్నారు.





వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న స్పోర్ట్స్ మల్లి, తదితరులు - కేక్ కట్ చేస్తున్న రామకృష్ణా రెడ్డి, తదితరులు

కొత్త ఇళ్లకు దరఖాస్తుల స్వీకరణ

కలకడ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) పథకం కింద కొత్త ఇళ్లకు నవంబరు 5 దాకా దరఖాస్తులు స్వీకరిస్తారని ఎంపీడీఓ భానుప్రసాద్ తెలిపారు. లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ ద్వారా రూ. 1.2లక్షలు, 90 పని దినాలకు ఉపాధి నిధులు రూ.27 వేలు, మరుగుదొడ్డి నిర్మాణానికి అదనంగా రూ.12 వేలు మంజూరు చేస్తామన్నారు. అర్హులు తమ ఆధార్, రేషన్ కార్డు, ఇంటి స్థల రుజువు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రెండు ఫొటోలు, జాబ్‌కార్డు, బ్యాంక్ పాసుబుక్ నకలును సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు అందజేసి ఆన్‌లైన్ చేయించు కోవాలని కోరారు. ఆధార్- బ్యాంక్ ఖాతా, మొబైల్ నెంబర్ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయించు కోవాలన్నారు.

రేషన్ షాపును స్థానికులకు కేటాయించండి

పెద్దమండ్యం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సి.గొల్లపల్లి పంచాయతీ కుడుమలవారిపల్లి పరిధిలోని 5 నెంబరు ప్రభుత్వ చౌకదుకాణం బియ్యం పంపిణీ స్థానికులకు కేటాయించాలని ప్రజలు కోరారు. షాపు నిర్వహణకు శివపార్వతి ఇటీవల రాజీనామా చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా ఆ రేషన్‌షాపు పరిధిలో బియ్యం పంపిణీ స్థానికులకు కేటాయించాలని ప్రజలు కోరారు.

నేడు మండల సమావేశం

వాల్మీకిపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం ఎంపీపీ అరుణ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మనోహర్‌రాజు పేర్కొన్నారు. అభివృద్ధిపై జరగనున్న ఈ సమీక్షా సమావేశానికి అన్ని శాఖాల అధికారులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పనిసరిగా హాజరు కావాలని తెలియజేశారు.

ముంపు ప్రాంతాల్లో పూడిక తీత పనులు చేపట్టాలి



పనులు చేయిస్తున్న దృశ్యం

నిమ్మనపల్లి అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ముంపు ప్రాంత కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. బుధవారం దిగువవీధిలో కాల్వలో పూడిపోయిన మురుగు నీటి కాల్వ సహా చల్లావారిపల్లిలో రోడ్డు పైన పారుతున్న నీటిని, కాల్వలను ఎక్స్‌వేటర్‌తో శుభ్రం చేయించారు. మిగిలిన పంచాయతీలో ఆయా కార్యదర్శులు ముంపు ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలన్నారు. కార్యదర్శి గోవిందు నాగరాజు, గౌతమి, గాయత్రి, రఫి, చిరంజీవి, నాగభూషణం, నాయక్, రెడ్డిప్రసాద్, రజిని పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టండి



కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ తాజ్‌మస్రూర్

మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీల్లో పారిశుధ్య చర్యలపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ వరుసగా కురిసిన వర్షాలతో గ్రామాల్లో మురుగునీటి కాల్వల్లో ఇసుక, మట్టి చేరి ఉంటుందని వెంటనే మురికినీటి కాల్వలను శుభ్రం చేయించాలన్నారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తను కంపోస్టు యార్డుకు తరలించాలన్నారు. తాగునీటి పథకాల ట్యాంకులను శుభ్రం చేయించి బ్లీచింగ్ చేయించాలన్నారు. తాగునీటి పైప్‌లైన్‌లు పగిలి ఉంటే వెంటనే వాటిని మరమ్మతు చేయించి నీటి కాలుష్యం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ ఏఈ పీవీ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

రామసముద్రం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రామసముద్రం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ(56) బుధవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. లక్ష్మీనారాయణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా బుధవారం రాయచోటిలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఎస్ఐ రమేష్‌బాబు, పోలీస్ సిబ్బందితో కలిసి లక్ష్మీనారాయణ మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జాతీయ కరాటే చాంపియన్‌గా ఫరాజ్



పీలేరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ కరాటే పోటీల్లో అండర్ 14 విభాగంలో పీలేరు వాసి ఎస్. ఫరాజ్ చాంపియన్ షిప్‌ను కైవశం చేసుకున్నట్లు శ్రీకాకతీయ విద్యాసంస్థల కరస్పాండెంట్ వెంకట్రమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూరత్‌లో జాతీయ స్థాయి కరాటే పోటీలు జరిగాయన్నారు. ఇందులో తమ పాఠశాల టెన్త్ విద్యార్థి ఫరాజ్ పలు రాష్ట్రాల అభ్యర్థులతో తలపడి జాతీయ కరాటే చాంపియన్ షిప్ మెడల్ సాధించినట్లు చెప్పారు. ఫరాజ్ కృషి, అంకితభావం, పట్టుదల, పోరాట స్ఫూర్తి పలువురు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

మదనపల్లె అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి ఆలయంలో జరిగిన అభివృద్ధి పనులను బుధవారం జిల్లా దేవాదాయశాఖాధికారి విశ్వనాథ్ పరిశీలించారు. కార్తీకమాసం అయ్యప్ప మాలధారుల సమయం అని తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భక్తుల పట్ల భక్తిభావంతో నడుకోవాలని పూజారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. భక్తులకు ఆలయంలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆలయ ఈఓ రమణ, ఆలయ కమిటీ సభ్యులు జర్మన్‌రాజు, హేమంత్, రాజు, శివమూర్తి, బాలకృష పాల్గొన్నారు.

మడికయ్యల శివాలయం కమిటీ నియామకం
అధ్యక్షుడిగా వెంకటరమణ



మదనపల్లె అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, చిప్పిలి గ్రామంలో ఉన్న (మడికయ్యల శివాలయం) శ్రీ యోగభోగేశ్వర దేవాలయం ఆలయ కమిటీని జిల్లా దేవాదాయశాఖాధికారి విశ్వనాధ్, ఆలయ ఈఓ రమణ వెల్లడించారు. అధ్యక్షుడిగా మదనపల్లె మండలం, అంకిశెట్టిపల్లె వాసి కొప్పల వెంకటరమణ, సభ్యులుగా చారాల భవానీ, ఎం. నాగరమ్య, డి.మల్లికారాణి, కె. ప్రకాష్ నాయుడు, పి. వరప్రసాద్, ఎస్ఎల్ నరసింహులు, సి. మల్లిక, బి. శివకుమార్‌ను నియమించారు. త్వరలోనే వీరు ప్రమాణం చేయనున్నారు.

బాహుదా పర్యాటకులు ప్రమాదాలకు గురికావద్దు



పర్యాటకులతో మాట్లాడుతున్న ఎస్ఐ తిప్పేస్వామి

నిమ్మనపల్లి అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాహుదా ప్రాజెక్టు చూసేందుకు వచ్చే పర్యాటకులు ప్రమాదాల బారిన పడవద్దని ఎస్ఐ తిప్పేస్వామి పేర్కొన్నారు. బుధవారం బాహుదా ప్రాజెక్టు ప్రవాహం తగ్గడంతో చేపలు పట్టేందుకు పర్యాటకులు ఎగబడ్డారు. అయితే చేపలు పట్టేందుకు వెళ్లిన పర్యాటకులను గుర్తించేందుకు డ్రోన్ ఉపయోగించి వారికి పట్టుకుని వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. బాహుదా పూర్తి స్థాయిలో నిండిందని ఏసమయమైనా గేట్లు తెరిచే అవకాశం వుండడంతో చేపల వేటకు వెళ్లరాదన్నారు. ఒక వేళ గేట్లు ఎత్తితే ఆ ప్రవాహంలో కొట్టుపోయే ప్రమాదముందన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదన్నారు. మహిళలు నీటిలో దిగి ఫొటోలు, సెల్ఫీలు తీరాదని, పోలీస్ పర్యవేక్షణ ఉంటుందన్నారు.

టీడీపీ నేత తలారి శ్రీనివాసులు మృతి



శ్రీనివాసులు భౌతిక కాయానికి నివాళు లర్పిస్తున్న దొమ్మలపాటి రమేష్

రామసముద్రం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నారిగానిపల్లె మాజీ సర్పంచ్, టీడీపీ నేత పూలకుంట్లపల్లె వాసి తలారి శ్రీనివాసులు బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. టీడీపీలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీకి పంచాయతీలో బలమైన నేతగా ఉండే వారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో పార్టీలకు అతీతంగా పలువురు నేతలు సంతాపం తెలిపారు. నియోజకవర్గ టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, మండల టీడీపీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడ్, గజ్జల సీతప్ప, కొండూరు నారాయణరెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌బాష తనయుడు జునైద్ అక్బరి, కోవా కృష్ణమూర్తి, వికాస్‌స్వామి, చిన్నుస్వామి, కాప్పల్లె రమణ, లోకనాథరాజు, శీన, రంగాని వెంకటేష్, పెద్దకురప్పల్లె మాజీ సర్పంచ్ రెడ్డిశేఖర్, బందేల శివ, నాగరాజ, చెంగారెడ్డి, వేణు, ఎల్.శివ, సలీం, అధిక సంఖ్యలో గ్రామస్తులు శ్రీనివాసులు మృతదేహానికి నివాళులర్పించారు.